
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



నంద్యాల

జిల్లా వార్తలు

ఆదివారం 28 సెప్టెంబరు 2025

లెక్క తేల్చారు



సూపర్-6 హామీలో భాగంగా ఆర్టీసీలో మహిళలకు 'స్త్రీ శక్తి' పేరుతో ఉచిత ప్రయాణం కల్పించింది. ఇదే క్రమంలో ఆటో, ట్యాక్సీ, క్యాబ్ డ్రైవర్లు సైతం నష్టపోకుండా 'వాహన మిత్ర' పేరుతో ఆదుకునేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. వైసీపీ హయాంలో రూ.10వేలు అందజేశారు. కూటమి ప్రభుత్వం ఒక్కొక్కరికి రూ.15వేలు అందించే దిశగా శ్రీకారం చుట్టింది. దీంతో ఆయా వర్గాల నుంచి దరఖాస్తులు స్వీకరణకు ప్రభుత్వం ఆదేశించింది. ఈ క్రమంలో గడువు లోపు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 24,197మంది 'వాహనమిత్ర' కోసం దరఖాస్తు చేసుకున్నారు.

- 'వాహన మిత్ర'కు 24,841 దరఖాస్తులు
- 24,197 మంది అర్హులుగా గుర్తింపు
- 644 దరఖాస్తులు తిరస్కరణ
- అక్టోబరు 4న డ్రైవర్ల అకౌంట్లకు నగదు జమ

నంద్యాల, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): వాహనమిత్ర పథకానికి వచ్చిన దరఖాస్తుల లెక్కను రవాణా శాఖాధికారులు తేల్చారు. గత ప్రభుత్వంలో లబ్ధి పొందిన వారితో పాటు కొత్త లబ్ధిదారులు కూడా ఉన్నట్లు తెలిసింది. వీరిలో అర్హులైన వారందరికీ అక్టోబరు 4వ తేదీన లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేయనున్నారని సమాచారం. ఆరోజున డ్రైవర్లతో పాటు ఆయా కుటుంబాల్లో సందడి వాతావరణం మొదలు కానుంది.

ఉమ్మడి జిల్లాలో..

జిల్లా పేరు	దరఖాస్తులు	అర్హులు	తిరస్కరణ
కర్నూలు	14,435	14,191	244
నంద్యాల	10,406	10,006	400
మొత్తం	24,841	24,197	644

గతం కంటే ఎక్కువగా...

ఉమ్మడి జిల్లా పరంగా పరిశీలిస్తే గత వైసీపీ హయాంలో కర్నూలు జిల్లాలో సుమారు 10 వేలు.. నంద్యాల జిల్లాలో 8,900మంది మాత్రమే లబ్ధి పొందినట్లు తెలుస్తోంది. కూటమి ప్రభుత్వ అమలు చేస్తున్న 'వాహనమిత్ర' కింద ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అధికార లెక్కల ప్రకారం.. 24,841మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో 24,197మంది అర్హులుగా అధికార యంత్రాంగం గుర్తించింది. మిగిలిన 644 దరఖాస్తులను వివిధ కారణాలతో తిరస్కరించారు. అయితే వీరిలో కూడా అర్హులు ఉంటే రెండో విడత కింద అందజేస్తారని తెలిసింది. మొత్తంగా వైసీపీ కంటే కూటమి ప్రభుత్వ హయాంలోనే లబ్ధిదారుల సంఖ్య 5 వేలకుపైగా పెరిగినట్లైంది.



అర్హుల జాబితా సిద్ధం

ప్రభుత్వ ఆదేశాలు మేరకు 'వాహనమిత్ర' కింద అర్హులు జాబితాను సిద్ధం చేశాం. ఒక్కొక్కరికి రూ.15వేల చొప్పున వారి ఖాతాల్లో అక్టోబరు 4న జమ కానుంది. తిరస్కరణకు గురైన దరఖాస్తులకు సంబంధించిన డ్రైవర్లు కూడా ఎలాంటి ఆందోళన చెందొద్దు. తగిన ఆధారాలు ఉంటే అర్హులుగా గుర్తించి రెండో విడతలో అందిస్తాం.

- జీవీ శివారెడ్డి, జిల్లా రవాణా శాఖాధికారి, నంద్యాల

పక్కాగా పరిశీలన...

'వాహన మిత్ర' కింద అర్హులైనవారికి న్యాయం జరిగేలా అధికార యంత్రాంగం క్షేత్రస్థాయిలో పక్కాగా పరిశీలన చేసింది. మండలాలు, మున్సిపాలిటీ, పట్టణ ప్రాంతాల వారిగా ఆన్‌లైన్‌లో ఆన్‌లైన్ వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించారు. మొత్తంగా అర్హులైన వారందరికి వాహన మిత్ర లబ్ధి చేకూరనుంది.

గ్రామ, వార్డు సచివాలయాల్లో..

అర్హులు.. అనర్హుల జాబితాను ఉమ్మడి జిల్లాలోని ఆయా గ్రామ, వార్డు సచివాలయాల్లో ఈనెల 30వ తేదీన ప్రదర్శించనున్నారు. దీంతో వాహన మిత్ర లబ్ధిదారుల్లో సైతం ఉత్కంఠ వీడనుంది. అధికార లెక్కల ప్రకారం.. అర్హులైన 24,197మందికి సంబంధించి ప్రభుత్వం రూ. 36.30 కోట్లు జమ చేయనుంది.

కాత్యాయనిగా భ్రమరాంబికాదేవి

- శ్రీశైలంలో ఆరో రోజు వైభవంగా కొనసాగిన శరన్నవరాత్రి ఉత్సవాలు



శ్రీశైలం, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): శ్రీశైల మహా పుణ్యక్షేత్రంలో దసరా మహోత్సవాలు కన్నుల పండువగా సాగుతున్నాయి. ఆరో రోజు శనివారం అమ్మవారికి ప్రాతఃకాల పూజలు, విశేష కుంకుమార్చన, నవావరణార్చనలు, జపానుష్ఠానాలు, పారాయణలు, సూర్య నమస్కారాలు, చండీహోమం, పంచాక్షరి, భ్రామరి, బాల జపానుష్ఠానాలు, చండీ హోమం, పంచాక్షరి, భ్రామరి, బాలా జపానుష్ఠానాలు, చండీ, చతుర్వేద పారాయణలు, కుమారీ పూజలు నిర్వహించారు. అలాగే రుద్రహోమం, రుద్రయాగాంగ జపాలు, రుద్ర పారాయణలు నిర్వహించారు. రాత్రి 9 గంటల నుంచి కాళరాత్రి పూజ, అమ్మవారి ఆస్థాన సేవ, సువాసినీ పూజలు చేశారు. భ్రమరాంబికాదేవి కాత్యాయని అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. నవదుర్గలలో ఆరో రూపమైన ఈ దేవి చతుర్భుజాలను కలిగి ఉండి, కుడివైపున అభయ హస్తాన్ని, వరముద్రను, ఎడమ వైపున పద్మాన్ని, ఖడ్గాన్ని ధరించి ఉంటారు. వర్షం కారణంగా స్వామి, అమ్మవార్ల హంస వాహన సేవ, పుష్ప పల్లకీ సేవలను రద్దు చేశారు. కార్యక్రమాల్లో ఆలయ ఈవో ఎం.శ్రీనివాసరావు, అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు

దసరా మహోత్సవాల సందర్భంగా ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్య కళారాధన వేదిక వద్ద సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. నెల్లూరుకు చెందిన కె. సుధాకరరావు, వారి బృందం చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు భక్తులను అలరింపజేశాయి.

నేటి కార్యక్రమాలు: భ్రమరాంబ అమ్మవారు ఏడో రోజు ఆదివారం కాళరాత్రి అలంకారంలో దర్శనమిస్తారు. సాయంత్రం స్వామి, అమ్మవార్లకు గజ వాహనం సేవ నిర్వహించనున్నారు.



స్వామి, అమ్మవార్లకు పూజలు నిర్వహిస్తున్న అర్చకులు



నృత్యం చేస్తున్న మహిళలు

జిల్లాలో వర్షాలు

- మహానందిలో అత్యధికంగా 87.2 మి.మీ. వర్షపాతం నమోదు



బుక్కాపురం వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న చెరువు అలుగు

నంద్యాల ఎడ్యుకేషన్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిశాయి. అత్యధికంగా మహానంది, వెలుగోడు, నంద్యాల బండిఆత్మకూరు, బేతంచర్ల, బనగానపల్లె మండలాల్లో భారీ వర్షపాతం నమోదయింది. జిల్లా వ్యాప్తంగా శనివారం ఒక్కరోజే 1216.8 మి.మీ. వర్షపాతం నమోదయింది. అనేక మండలాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురవడంతో వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. మహానంది మండలంలో అత్యధికంగా 87.2 ఎంఎం వర్షపాతం నమోదయింది. దీంతో బుక్కాపురం వద్ద చెరువు అలుగులు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో రాకపోకలు నిలిచిపోయాయి. వెలుగోడు మండలంలో 77.6, నంద్యాల మండలం 74.2, ఆత్మకూరు 73.4, నంద్యాల పట్టణం 70.0, బండిఆత్మకూరు 63.2, బేతంచర్ల 60.4, బనగానపల్లె 58.0, కొత్తపల్లె 57.0, శ్రీశైలం 55.0, పాణ్యం 52.4, నందికొట్కూరు మండలంలో 51.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది. అలాగే జూపాడుబంగ్లా 51.4, పాములపాడు 51.2, పగిడ్యాల 44.8, డోన్ 42.2, గడివేముల 39.4, గోస్పాడు 38.0, మిడ్తూరు 37.2, కోవెలకుంట్ల 32.0, శిరివెళ్ల 19.2, రుద్రవరం 16.8, ప్యాపిలి 15.2, దొర్నిపాడు 12.4, అవుకు 11.4, సంజామల మండలంలో 9.6 ఎంఎం వర్షపాతం నమోదయింది.

సమయ పాలన పాటించాలి

ఆళ్లగడ్డ/ శిరివెళ్ల సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వైద్యశాలల్లో వైద్యాధికారులు, సిబ్బంది సమయ పాలన పాటించాలని డీఎంహెచ్‌వో వెంకటరమణ తెలిపారు. శనివారం మండలంలోని అహోబిలం ఆరోగ్య కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. శిరివెళ్ల మండలంలోని యర్రగుంట్ల పీహెచ్‌సీలో నిర్వహించిన ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఆయన శనివారం ప్రారంభించారు. పీహెచ్‌సీ వైద్యులు ఫిరోజ్, కావ్య చందన, ఎంపీ హెచ్‌ఈవో నాగార్జునరెడ్డి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

లింగనిర్ధారణ పరీక్షలు చేస్తే..

నంద్యాల హాస్పిటల్: జిల్లాలో లింగనిర్ధారణ పరీక్షలు చేసినా, ప్రోత్సహించినా క్రిమినల్ చర్యలు తీసుకుంటామని డీఎంహెచ్‌వో డా.ఆర్.వెంకటరమణ తెలిపారు. అలాంటి కేంద్రాలను సీజ్ చేస్తామన్నారు. శనివారం డీఎంహెచ్‌వో కార్యాలయంలో పీసీ అండ్ పీఎస్‌డీటీ యాక్ట్-1994సలహా కమిటీ జిల్లాస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్ స్కానింగ్ సెంటర్లపై అధికారులు క్రమం తప్పకుండా తనిఖీలు చేపట్టాలన్నారు. డీఐవో సుదర్శన్ బాబు, డెమో ఇన్‌చార్జి కె.రవీంద్రనాయక్, వైద్యాధికారులు పద్మజ, అరుణజ్యోతి, శ్రావణ్‌కుమార్, ఎన్‌జీవోలు డా.రాజశేఖర్, పాల్‌రాజారావు, రామారావు, న్యాయవాది మోతీలాల్, వంశీ పాల్గొన్నారు.

ఈవీఎంల గోడౌన్ తనిఖీ



ఈవీఎంల గోడౌన్‌ను తనిఖీ చేస్తున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల ఎడ్యుకేషన్, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని టెక్కె మార్కెట్‌యార్డులోని ఈవీఎంల గోడౌన్‌ను కలెక్టర్ రాజకుమారి శనివారం తనిఖీ చేశారు. అన్ని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో గోడౌన్ సీల్‌ను తొలగించి కలెక్టర్ ఈవీఎంలను పరిశీలించారు. అనంతరం పర్యవేక్షణ రిజిస్టర్‌లో సంతకం చేసి తనిఖీలను అధికారికంగా నమోదు చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈవీఎం గోడౌన్ వద్ద విధులు నిర్వర్తిస్తున్న పోలీస్ గార్డులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి నిర్లక్ష్యం చేయకుండా పటిష్ట భద్రతా చర్యలు తీసుకోవాలని సూచించారు. కలెక్టర్ వెంట డీఆర్వో రామునాయక్, ఆర్డీవో విశ్వనాథ్, తహసీల్దార్ శ్రీనివాసులు, ఎలక్షన్ డీటీ మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

అపార్ ఐడీ కీలకం: కలెక్టర్

నూతన జాతీయ విద్యావిధానంలో విద్యార్థుల విద్యాపురోగతిని ట్రాక్ చేయడానికి అపార్(ఆటోమేటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ) కీలకమని కలెక్టర్ రాజకుమారి అన్నారు. పట్టణంలోని కలెక్టర్ చాంబర్‌లో శనివారం అపార్ ఐడీ ప్రగతిపై కలెక్టర్ రాజకుమారి విద్యాశాఖ అధికారులతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ 138 ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో ఇంటర్ చదువుతున్న 16,102 మంది విద్యార్థుల్లో 11,301 మంది విద్యార్థులకు అపార్ ఐడీ పూర్తయిందని తెలిపారు. పదో తరగతి సర్టిఫికేట్‌లోని పేరు, పుట్టిన తేదీ, ఆధార్‌లోని పేరు పుట్టినతేదీ సమానంగా ఉంటేనే అపార్ ఐడీ జనరేట్ అవుతుందని చెప్పారు. ఆధార్ నమోదు కేంద్రానికి వెళ్లి రూ.50లు చెల్లించి అపార్ ఐడీ జనరేట్ చేయించుకోవాలని సూచించారు. 1962 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న 3,30,135 మంది విద్యార్థుల్లో 2,72,193 మందికి అపార్ ఐడీ పూర్తయిందని, మిగిలిన 57,942 మంది ఐడీలు త్వరితగిన పూర్తి చేయాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో 40,798 మంది చిన్నారులలో 24,936 మందికి అపార్ ఐడీ పూర్తి కాగా 15,894 ఐడీలు పూర్తి చేయాల్సి ఉందన్నారు. డీఈవో, డీవీఈవో, ఐసీడీఎస్ పీడీలు పూర్తి స్థాయిలో దృష్టిసారించి ప్రత్యేక చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో డీఈవో జనార్దన్‌రెడ్డి, డీవీఈవో శంకర్‌నాయక్, ఐసీడీఎస్ పీడీ లీలావతి, జీఎస్‌డబ్ల్యూఎస్ కోఆర్డినేటర్ ఖాదర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలంలో డ్రోన్ చక్కర్లు

శ్రీశైలం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): శ్రీశైల ఆలయం పరిసరాల్లో డ్రోన్ చక్కర్లు కొట్టింది. స్థానికుల సమాచారంతో దేవస్థానం భద్రతా విభాగం, స్థానిక పోలీసులు అప్రమత్తమయ్యారు. శ్రీశైలంలో గల శివాజీ స్ఫూర్తి కేంద్రం వద్ద డ్రోన్ ఎగురవేసిన వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాలెంకు చెందిన వ్యక్తి పవన్‌గా గుర్తించారు. స్థానికంగా ఓ ప్రైవేటు కార్యక్రమానికి వచ్చి అవగాహన లోపంతో డ్రోన్‌ను ఎగురవేసినట్లు తెలిసింది. అతని వద్ద నుంచి అధికారులు డ్రోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈవిషయంపై వన్‌టౌన్ సీఐ ప్రసాదరావుతో మాట్లాడగా ఇంకా ఫిర్యాదు అందలేదన్నారు.



అధికారులు స్వాధీనం చేసుకున్న డ్రోన్

శ్రీశైలానికి భారీ వరద


10 గేట్లతో నీటి విడుదల



10 గేట్లతో కొనసాగుతున్న నీటి విడుదల

శ్రీశైలం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం జలాశయానికి భారీగా వరద వచ్చి చేరుతోంది. శనివారం జలాశయం క్రస్టుగేట్ల ఎత్తు 18 అడుగులకు పెంచారు. 10 గేట్ల స్పిల్‌వే నుంచి 4,26,160 క్యూసెక్కుల వరద నీటిని సాగర్‌కు సాగనంపతున్నారు. డ్యాం నీటిమట్టం శనివారం సాయంత్రం 6 గంటల సమయానికి 882 అడుగులుగా ఉండగా నీటినిల్వ సామర్థ్యం 203 టీఎంసీలుగా ఉంది. శ్రీశైలం రెండు విద్యుత్ కేంద్రాల్లో ఉత్పత్తి అనంతరం 65,164 క్యూసెక్కులు విడుదల చేశారు.

తిలకం చుక్కలతో భగత్‌సింగ్ చిత్రం



నంద్యాలకు చెందిన శ్రేష్ఠ శనివారం భగత్‌సింగ్ జయంతిని పురస్కరించుకొని 3,265 తిలకం చుక్కలతో భగత్‌సింగ్ చిత్రాన్ని చిత్రీకరించింది. 14ఇంటూ 10 అంగుళాల వెడల్పు గల డ్రాయింగ్ చార్టు మీద తిలకం చుక్కలతో భగత్‌సింగ్ చిత్రాన్ని తయారుచేసింది. ఏడో తరగతి చదువుతున్న శ్రేష్ఠ కోటేష్ ఆర్ట్ అకాడమీ లో శిక్షణ తీసుకుంటుంది. చిట్టిచేతులతో భగత్‌సింగ్ చిత్రాన్ని చిత్రీకరించినందుకు గురువు కోటేష్ అభినందించారు.



● నంద్యాల కల్చరల్, ఆంధ్రజ్యోతి

జిల్లా ఇమ్యునైజేషన్ అధికారిగా ఉమా



కర్నూలు హాస్పిటల్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారిగా డాక్టర్ పి.ఉమాను పదోన్నతిపై నియమిస్తూ వైద్యఆరోగ్య శాఖ డైరెక్టర్ ఆఫ్ హెల్త్ ఉత్తర్వులు జారీ చేశారు. కర్నూలు జిల్లా వైద్యఆరోగ్యశాఖలో ఎన్‌హెచ్‌ఎం ప్రోగ్రాం ఆఫీసర్‌గా పని చేస్తున్న డాక్టర్ ఉమాకు సివిల్ సర్జన్‌గా పదోన్నతి కల్పించి డీఐవోగా నియమించారు. ఎన్‌హెచ్‌ఎం ప్రోగ్రాం ఆఫీసర్‌గా నాలుగు సంవత్సరాలు పని చేసిన ఆమెను గత రెండేళ్లుగా ఖాళీగా ఉన్న డీఐవోగా నియమిస్తూ హెల్త్ డైరెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. కొత్త డీఐవోకు కార్యాలయ సిబ్బంది అభినందనలు తెలిపారు.



కాత్యాయనీమాత అలంకారంలో చౌడేశ్వరీమాత అమ్మవారు



లలితా త్రిపుర సుందరీ దేవి అలంకరణలో సుంకులాపరమేశ్వరి అమ్మవారు



మహనందిలో కాత్యాయని దుర్గ అలంకరణలో కామేశ్వరీదేవి



గీతామందిరంలో వేంకటేశ్వర స్వామి అలంకరణలో అమ్మవారు

ఆలయాల్లో నవరాత్రి ఉత్సవాలు

కర్నూలు కల్చరల్/గూడూరు/బనగానపల్లె, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): దసరా పండుగ సందర్భంగా దేవీ నవరాత్రి ఉత్సవాలు ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యాప్తంగా వైభవంగా కొనసాగుతున్నాయి. ఆరో రోజు శనివారం అమ్మవారి ఆలయాల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు, నైవేద్యాల సమర్పణతోపాటు విశేష అలంకరణలు చేసి భక్తులకు దర్శనం కల్పించారు. కర్నూలు నగరంలోని చిన్న అమ్మవారిశాలలో వాసవీమాత పద్మావతి-వేంకటేశ్వర స్వామి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. వన్ టౌన్‌లోని గీతామందిరంలో వాసవీ కన్యకా పరమేశ్వరి దేవి అమ్మవారికి వేంకటేశ్వర స్వామిగా, కల్లూరులోని వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారు లలితా త్రిపుర సుందరీ దేవిగా దర్శనమిచ్చారు. గోదా గోకుల క్షేత్రంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి లలితా త్రిపుర సుందరీ దేవి పూజలు చేశారు. నంద్యాల జిల్లా బనగానపల్లె మండలంలోని నందవరం చౌడేశ్వరీ మాత కాత్యాయనీమాతగా దర్శనమిచ్చారు. గూడూరు మండలం కె.నాగలాపురంలోని సుంకులాపరమేశ్వరి అమ్మవారు లలితా త్రిపుర సుందరీ దేవిగా దర్శనమిచ్చారు.

కాత్యాయని దుర్గగా కామేశ్వరీదేవి

మహానంది, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్రంలో దసరా దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల వైభవంగా కొనసాగుతున్నాయి. శనివారం ఆరో రోజు అమ్మవారి ఆలయంలో అర్చకుడు వనిపెంట ప్రకాశంశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలతో పాటు కుంకుమార్చన పూజలను నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన యాగశాల మంటపంలో వేదపండితులు, రుత్వికులు భక్తిశ్రద్ధలతో చండీ యాగం, హోమాలను నిర్వహించారు. సాయంకాలం 6 గంటల నుంచి కామేశ్వరీదేవిని కాత్యాయని దుర్గ అలంకారంలో భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయ ప్రాంగణంలో సహస్ర దీపాలంకరణ సేవ వైభవంగా నిర్వహించారు. కాత్యాయని దుర్గ అలంకారంలో ఉన్న అమ్మవారు గజ వాహనంపై విహరించారు. ఉత్సవం ముందు చిన్నారులు నిర్వహించిన కూచిపూడి నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఆలయ అధికారులు, భక్తులు పాల్గొన్నారు.



చిన్న అమ్మవారిశాలలో అమ్మవారికి పద్మావతి-వేంకటేశ్వర స్వామి అలంకరణ

పర్యాటక రంగం అభివృద్ధికి కృషి

● కలెక్టర్ డాక్టర్ సిరి





కర్నూలు కలెక్టరేట్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయడానికి అన్ని విధాలా కృషి చేస్తామని కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి వెల్లడించారు. శనివారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సిరి మాట్లాడుతూ ఈ ఏడాది ప్రపంచ పర్యాటక దినోత్సవం థీమ్ స్థిరమైన పర్యాటకం, పరివర్తన అని తెలిపారు. జిల్లాలో రూ.14 కోట్లతో ఐదు టూరిజం ప్రాజెక్టులను అభివృద్ధికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు సమర్పించారన్నారు. జిల్లాలో కేవలం 7 శాతం మాత్రమే అడవులు ఉన్నాయనీ, దీన్ని 50 శాతానికి పెంచే దిశగా కృషి చేస్తున్నామని తెలిపారు. జడ్పీ సీఈఓ నాసర రెడ్డి మాట్లాడుతూ ప్రపంచంలో కొన్ని దేశాలు కేవలం పర్యాటకంపైనే మనుగడ సాధిస్తున్నాయన్నారు. టూరిజం శాఖ సలహాదారులు, టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య మాట్లాడుతూ జిల్లాలో కేతవరం, జొన్నగిరి వంటి ప్రాంతాల్లో తెలుగులో శాసనాలు ఉన్నాయన్నారు. జిల్లాలో కొండారెడ్డి బురుజు, తదితర అద్భుతమైన పర్యాటక ప్రాంతాలు ఉన్నాయని వాటిని మనం కాపాడుకోవాలన్నారు. టూరిజం శాఖ అధికారి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడుకుంటూ పర్యాటకాన్ని అభివద్ధి చేసుకోవాలని పిలుపునిచ్చారు. కర్నూలు జిల్లాలో శిల్పారామం ఏర్పాటుకు కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో వెంకట నారాయణమ్మ, హౌసింగ్ పీడీ చిరంజీవి, సెట్కూరు సీఈఓ వేణుగోపాల్, డీఎస్ఓ రాజా రఘువీర్, ఆర్ఐఓ లాలెప్ప తదితరులు పాల్గొన్నారు.



ప్రపంచ పర్యాటక దినోత్సవంలో పాల్గొన్న అధికారులు

కళాకారులకు ప్రభుత్వ ప్రోత్సాహం అవసరం

కర్నూలు కల్చరల్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కళాకారులకు ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం కల్పించాలని టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షులు కళారత్న పత్తి ఓబులయ్య కలెక్టర్ డాక్టర్ ఏ.సిరిని కోరారు. కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంను కళాకారులు, కళల కోసం ఉచితంగా కేటాయించాలన్నారు. దీంతో పాటు కలెక్టర్ అధ్యక్షతన ఉన్న కళాసమితికి యువ కళాకారులతో కూడిన కొత్త కార్యవర్గాన్ని నియమించాలన్నారు. ప్రభుత్వం సహకరిస్తే టీజీవీ కళాక్షేత్రం సంయుక్తంగా వారం రోజుల పాటు కర్నూలు ఉత్సవ్ పేరుతో రాష్ట్ర అవతరణ వేడుకలు నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు.

అలివి వలతో చేపల వేట

● ఇంజిన్ బోట్లనూ వినియోగిస్తున్న మత్స్యకారులు
● చేప పిల్లలను పట్టేసి విక్రయిస్తున్న వైనం
● ఇలాగే కొనసాగితే భవిష్యత్తులో జీవనాధారం కోల్పోయే ప్రమాదం



చిన్న చేపలను పట్టుతున్న మత్స్యకారులు

శ్రీశైలం, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): అలివి వలలు.. ఇంజిన్ బోట్ల చేపలు వేటాడడం నిషేధం. అయినప్పటికీ మత్స్యకారులు అవేవీ పట్టించుకోడం లేదు. చేప పిల్లలు ఎదగక ముందే అలివి వలలతో వేట కొనసాగించి వాటి పట్టి విక్రయిస్తున్నారు. ప్రస్తుతం డబ్బు సంపాదించుకోవాలన్న ఉద్దేశంతో ఉన్నారు. అయితే భవిష్యత్తులో జీవనాధారం లేకుండా చేసుకుంటున్నారు. శ్రీశైలం మండలంలోని లింగాలగట్టు గ్రామవాసుల జీవనాధారం చేపల వేట. అయితే చేప పిల్లలు ఎదగక ముందే చిదిమేస్తున్నారు. శ్రీశైలం డ్యాం గేట్లను తెరిచిన సమయంలో నీటి ప్రవాహ వేగం ఎక్కువ ఉంటుంది. అయినప్పటికీ పెద్ద బ్రిడ్జి కింద ప్రమాదపుటంచుల్లో పుట్టీలపై వేట సాగిస్తున్నారు. లింగాలగట్టు గ్రామం హైదరాబాద్ రహదారిలో ఉండడంతో చేపల వ్యాపారం జోరుగా కొనసాగుతోంది. జూన్ నుంచి ఆగస్టు వరకు చేప గుడ్డు పెట్టే కాలంలో చేపల వేట అనేది నిషేదం ఉన్నా.. మత్స్యశాఖ అధికారుల నోటీసులను మత్స్యకారులు పెడచెవిన పెడుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. లింగాలగట్టు గ్రామంలో చాపలు ఎగుమతి చేసే కంపెనీలు శ్రీశైలం జలశయంలోని చాపలను ఇతర ప్రాంతాలకు సైతం వాహనాల ద్వారా ఎగుమతులు చేస్తు సొమ్ము చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఆత్మకూరు ఎఫ్‌డీవో అధికారి భరత్‌లాల్ నాయక్‌ను వివరణ కోరగా లింగాలగట్టు గ్రామాన్ని సందర్శిస్తామని తెలిపారు. పరిశీలన అనంతరం చర్యలపై వివారాలు తెలియజేస్తామన్నారు.





చేపల ఎగుమతికి సిద్ధంగా వాహనాలు



ఇంజిన్ బోట్ల నుంచి తెచ్చిన చేపలు

మంత్రాలయానికి కొత్త శోభ

● త్రీస్టార్ హోటల్ నిర్మాణానికి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్
● రూ.20కోట్ల ఒప్పందంతో పనులు
● పర్యాటక రంగానికి పెద్దపీట
● వందలాది మందికి ఉపాధి



మంత్రాలయంలో త్రీస్టార్ హోటల్ నిర్మించే భవనం నమూనా

మంత్రాలయం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): రెండో తిరుపతిగా పేరుగాంచిన మంత్రాలయానికి కొత్త శోభ రానుంది. రాఘవేంద్ర స్వామి సన్నిధానంలో పర్యాటక రంగానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఈనెల 3వ తేదీన జరిగిన మంత్రివర్గ కేబినెట్ సమావేశంలో మంత్రాలయానికి త్రీస్టార్ హోటల్ ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. 4.25 ఎకరాల్లో ఈహోటల్ నిర్మాణానికి సీఎం చంద్రబాబు నాయుడు, టూరిజం శాఖ మంత్రి కందుల దుర్గేష్, టూరిజం స్పెషల్ చీఫ్ సెక్రటరీ అజయ్ జైన్, టూరిజం చీఫ్ ఎగ్జిక్యూటివ్ అధికారి అమరపాలి, హైదరాబాదు చెందిన అబోడే హోటల్ ఎండీ రామస్వామి వెంకటరమేష్ పారిశ్రామికవేత్తలతో రూ.20కోట్లతో ఒప్పందం కుదుర్చుకుంది.

ఉపాధి కల్పించడమే లక్ష్యంగా..

ఇందుకోసం 400 మందికి ప్రత్యక్షంగా ఉపాధి కల్పించేందుకు కూటమి ప్రభుత్వం లక్ష్యంగా చేసుకుంది. ప్రభుత్వం కేటాయించిన ఈస్థలంలో 120 గదులు, రెస్టారెంట్, కాఫీ షాప్, కల్యాణ మండపం, కింది బాగంలో సెల్లార్ పనులు ప్రారంభమయ్యాయి ఇప్పటికే మెటీరియల్ అంతా సిద్ధం చేసుకుని వచ్చే ఆగస్టు నాటికి 120రూములు నిర్మించేందుకు అబోడే హోటల్ యజమానులు శ్రీకారం చుట్టారు. 2017లో అబోడే హోటల్ నిర్మాణం చేపట్టి భక్తులకు వసతి, రెస్టారెంటు కొనసాగుతుంది. గత వైసీపీ ప్రభుత్వం పర్యాటక రంగాన్ని నిర్లక్ష్యం చేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 15నెలల్లోనే మంత్రాలయానికి త్రీస్టార్ హోటల్ రావడం, దాదాపు 400మందికి ఉపాధి కల్పనతో నియోజకవర్గ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఉపాధి కల్పిస్తున్నాం



ఏపీ రాష్ట్ర ప్రభుత్వం స్థలం కేటాయించింది. త్రీస్టార్ హోటల్ నిర్మాణంతో దాదాపు 400 మందికి ఉపాధి కల్పిస్తున్నాం. మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థుల ఆశీస్సులతో 120రూములు, రెస్టారెంటు, కల్యాణ మండపం పనులు ఇప్పటికే ప్రారంభించాం. వచ్చే ఏడాదికి పనులు పూర్తిచేస్తాం.

● రజనీకాంత్, మేనేజర్, అబోడే హోటల్, మంత్రాలయం



సీఎం చంద్రబాబుతో మంత్రాలయం స్టార్ హోటల్‌కు ఒప్పందం అగ్రిమెంటు తీసుకుంటున్న రమేష్ (ఫైల్)

స్త్రీనిధిలో చేతివాటం

● నాలుగేళ్లుగా ఖాతా బ్లాక్
● రుణం కోసం పొదుపు మహిళల ఎదురు చూపు
● పొందిన రుణాల్లో సీసీల చేతివాటం..?



చేతివాటానికి కాదేదీ అనర్హం అన్నచందంగా స్త్రీనిధి రుణాల్లోనూ కొందరు సీసీలు అవినీతికి పాల్పడ్డారు. పొందిన రుణాలను కొందరు సక్రమంగా చెల్లించకపోవడంతో పొదుపు సంఘంలో మిగిలిన వారికి భారంగా మారింది. దీంతో ఈ పథకాన్ని నాలుగేళ్ల క్రితం బ్లాక్ చేశారు. ఫలితంగా ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోంది.

రుద్రవరం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): పొదుపు మహిళలకు స్త్రీనిధి చేయూతనిస్తుంది. స్వయం ఉపాధి వైపు అడుగులు వేయిస్తుంది. ఆర్థిక క్రమశిక్షణ ఆధారంగా పొదుపు సంఘాలు, స్వయం సహాయక సంఘాలకు బ్యాంకులు బారీగా రుణాలు మంజూరు చేస్తాయి. కానీ రుద్రవరం మండలంలో స్త్రీనిధి ఖాతా బ్లాక్ చేయాల్సిన దుస్థితి నెలకొంది. ఫలితంగా మహిళలు రుణం కోసం ఎదురు చూపే తప్ప ఖాతా మాత్రం తెరవలేదు. రుద్రవరం వెలుగు కార్యాలయం పరిధిలో స్త్రీనిధి ఖాతా సుమారు నాలుగేళ్ల క్రితం బ్లాక్ చేశారు. స్త్రీనిధి రుణాలు పొంది చెల్లించకపోవడంతో ఆ పథకాన్ని బ్లాక్ చేశారు. రుద్రవరం మండలంలో 1103 పొదుపు సంఘాలు, 12103 మంది సభ్యులు, 46మంది వీవోలు ఉన్నారు. సుమారు రూ.35 లక్షలు బకాయి ఉంది. రికవరీ కాకపోవడంతో నాలుగేళ్లక్రితం ఖాతాను బ్లాక్ చేశారు. అధికారులు, కొందరు పొదుపు మహిళల నిర్లక్ష్యం మగిలిన సభ్యులందరికీ శాపంగా మారింది. తీసుకున్న స్త్రీనిధి రుణాలను సక్రమంగా రికవరీ చేయించడంలో అధికారులు పట్టించుకోకపోవడంతో మిగతా వారికి భారమైంది. పొందిన రుణాల్లో సీసీలు కూడా అవినీతికి పాల్పడినట్లు ఆరోపణలున్నాయి.

రుణాల కోసం ఎదురుచూపు?

స్త్రీనిధి రుణాల కోసం పొదుపు మహిళలు ఏళ్లుగా ఎదురు చూస్తున్నారు. అక్రమాలు జరగడంతో వారు స్త్రీనిధి ద్వారా రుణాలు పొందే అవకాశం కోల్పోయారు. ఇందులో అప్పట్లో పనిచేసిన సీసీల ప్రమేయం కూడా ఉన్నట్లు తెలుస్తోంది. రికవరీలు సరిగ్గా కాకపోవడంతో ఖాతాను లాక్ చేశారు. అర్హులైన పొదుపు మహిళలు కూడా రుణాలు పొందలేదు. ఇలా అధికారుల నిర్లక్ష్యం పొదుపు మహిళలకు శాపంగా మారింది. అప్పట్లో పొందిన స్త్రీనిధి రుణాల్లో సీసీలు చేతివాటం ప్రదర్శించారు. కొందరు రుణాలు తీసుకుని ఇంత వరకు చెల్లించకపోవడంతో బకాయిలు అలాగే ఉండిపోయాయి. దీనివల్ల అర్హులైన పలువురు పొదుపు మహిళలకు స్త్రీనిధి రుణం తీసుకోవడానికి ఆస్కారం లేకుండాపోయింది. తీసుకున్న రుణాలను అప్పట్లో పనిచేసిన సీసీలు, కొంత మంది మహిళలు కలిసి తిరిగి చెల్లించకపోవడమే ఇందుకు కారణమనే విమర్శలున్నాయి. ఆ ఖాతా నేటికీ తెరవలేదు. దీంతో రుణం పొందలేకపోతున్నామని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



రుద్రవరం వెలుగు కార్యాలయం

పీడీ దృష్టికి తీసుకెళుతున్నా



స్త్రీనిధిలో జరిగిన అవినీతి విషయం డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి దృష్టికి తీసుకెళుతున్నా. రూ.24లక్షలు ఉన్న రుణ బకాయిలు రూ.10లక్షల వరకు తెచ్చా. ఇంకా రూ.14లక్షలు బకాయిలు మిగిలాయి. ఈ విషయాన్ని పీడీ దృష్టికి తీసుకెళ్లి ఖాతా తెరిపించి పొదుపు మహిళలకు రుణాలు అందేలా కృషి చేస్తా.

● వసంతకుమారి, ఏపీఎం, వెలుగు, రుద్రవరం

విజయ డెయిరీలో అవినీతిని అరికట్టాలి

• ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ



ఆళ్లగడ్డ, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): విజయ డెయిరీలో జరుగుతున్న అవినీతిని అరికట్టాలని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ కోరారు. శనివారం అసెంబ్లీ సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో విజయ డెయిరీ అంటే ఒక బ్రాండ్ అని, దీని వెనకల ప్రభుత్వం ఉందని, స్వచ్ఛమైన పాలు, నెయ్యి అందించడంలో ఈ డెయిరీకి మంచినది లేదని పేరుండేదని చెప్పారు. 1983లో అప్పటి ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు నంద్యాల డెయిరీని ఏర్పాటు చేశారని, అయితే ప్రస్తుత చైర్మన్ ఆయన ఫొటోను, శిలాఫలకాన్ని పక్కన పడేశారని చెప్పారు. గతంలో 30ఏళ్ల భూమా నారాయణరెడ్డి చైర్మన్‌గా ఉండేవారని, అప్పట్లో ఒక్క చుక్క పాలు కల్తీ కాకుండా, అనినీతి జరగకుండా సంస్థను అభివృద్ధి పథకంలో నడిపించారని అన్నారు. అయితే ఈ డెయిరీపై వైసీపీ నాయకుల కన్ను పడినప్పటి నుంచి పాలు కల్తీమయంగా మారాయన్నారు. విజయ డెయిర్ బ్రాండ్ ను అడ్డు పెట్టుకొని చేస్తున్న అరాచకాలు అన్నీఇన్నీ కావన్నారు. ఎవరైె ప్రశ్నిస్తే వారిని విధుల నుంచి తొలగిస్తున్నారని, ఇతర ప్రాంతాలకు బదిలీ చేస్తున్నారని ఆరోపించారు.

విచారించి చర్యలు తీసుకుంటాం : మంత్రి అచ్చెన్నాయుడు

నంద్యాల విజయ డెయిరీపై వచ్చిన ఆరోపణ లపై కమిటీ వేసి విచారించి చర్యలు తీసుకుంటామని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. మంగళగిరిలోని డెయిరీ డెవలప్‌మెంట్ కోఆపరేటివ్ ఫెడరేషన్ లిమిటెడ్ వారిని విచారణ అధికారిగా నియమించామని చెప్పారు. వారు ఇచ్చే నివేదికల ప్రకారం చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

10లోపు ఇంటర్ పరీక్షల ఫీజు చెల్లించాలి

కర్నూలు ఎడ్యుకేషన్, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): 2026లో జరిగే ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలకు పరీక్ష ఫీజు చెల్లించడానికి వచ్చే నెల 10న చివరి తేదీ అని ఆర్‌ఐవో జి.లాలెప్ప శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దసరా సెలవుల అనంతరం అక్టోబరు 6వ తేదీన కళాశాలలకు విద్యార్థులు వచ్చినప్పుడు తప్పనిసరిగా పరీక్ష ఫీజులు చెల్లించేలా తల్లిదండ్రులు సహకరించాలన్నారు. కళాశాల ప్రిన్సిపాళ్లు కూడా చివరి తేదీ వరకు వేచి ఉండకుండా పరీక్ష ఫీజు ఆన్‌లైన్ పేమెంట్ గాని, బ్యాంకు చలానా రూపంలో గాని చెల్లించేలా చూడాలన్నారు. దసరా సెలవుల్లో తరగతులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఇంటర్ బోర్డు అధికారులు కళాశాలల యజమాన్యాలను హెచ్చరించారు.

వర్షాలకు 70గొర్రెలు మృతి

ఎమ్మిగనూరు రూరల్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు మండలంలోని సోగనూరు 70కి పైగా గొర్రెలు మృతిచెందాయి. శనివారం ఈఘటన చోటుచేసుకున్నట్లు గొర్రెల కాపరులు తెలిపారు. వివరాలు.. గ్రామానికి చెందిన పెద్దలక్ష్మన్న 10, రాజు 12, నబీరసూల్ 8, గొర్రెల రామయ్య 8, పరుశురాముడు 10, వీరేష్ 12, దాసరి గిడ్డయ్య 12, చిన్నలక్ష్మన్న 3, ఉలిగప్పతో పాటు మరి కొంతమంది గొర్రెలు మృతిచెందాయి. ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరారు. ఈఘటనపై వెటర్నరీ ఏడీ సుబ్రమణ్యంను వివరణ కోరగా ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు గొర్రెలు మృతి చెందాయన్నారు. జీవాలు వర్షానికి తడవకుండా గొర్రెల కాపరులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.



మృతి చెందిన గొర్రెలు

వ్యవసాయ మోటార్లు చోరీ

శిరివెళ్ల, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని గోవిందపల్లె నుంచి ఇసుకపల్లెకు వెళ్లే రహదారిలోని రైతులకు చెందిన వ్యవసాయ మోటార్లు చోరీకి గురయ్యాయి. శిరివెళ్ల ఎస్ఐ చిన్న పీరయ్య తెలిపిన వివరాలివీ.. గోవిందపల్లెకు చెందిన రైతులు శ్రీనివాసరెడ్డి, రామయ్య, కాశయ్య పొలాల్లోని వ్యవసాయ మోటార్లను(రూ.65 వేలు విలువ చేసే) గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకుని వెళ్లారన్నారు. బాధిత రైతు శ్రీనివాసరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

కియ షోరూం ప్రారంభం

నంద్యాల నూనెపల్లి, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): గోస్పాడు మండల పరిధిలోని దీబగుంట్ల గ్రామ సమీపంలో ఎంజీబీ గ్రూప్ సీఈవో ఆదిత్య మాచాని కుటుంబ సభ్యులతో కలిసి శనివారం కియ షోరూంను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. షోరూంలో అన్నిరకాల కియ వాహనాలు అందుబాటులో ఉన్నాయని, ఆసక్తి కలవారు షోరూంను సందర్శించి టెస్ట్ డ్రైవ్ చేయాలని తెలిపారు. ఎంజీబీ గ్రూప్ మెంబర్ తారకేశ్వర్ జనరల్ మేనేజర్ ఎల్లప్ప, సిబ్బంది పాల్గొన్నారు.



షోరూం ప్రారంభిస్తున్న ఎంజీబీ గ్రూప్ సీఈవో ఆదిత్య మాచాని, కుటుంబసభ్యులు

పాడి పరిశ్రమ అభివృద్ధే లక్ష్యం



మాట్లాడుతున్న పశుసంవర్ధకశాఖ డీడీ రమణయ్య

చాగలమర్రి, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పాడి పరిశ్రమను అభివృద్ధి చేయడమే లక్ష్యమని ఆళ్లగడ్డ పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ రమణయ్య తెలిపారు. పశువైద్య కేంద్రంలో శనివారం ఏడీ వరప్రసాద్ అధ్యక్షతన సమీక్షా సమావేశం నిర్వహిం చారు. ఆయన మాట్లాడుతూ రైతులు పశువుల వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ఆళ్లగడ్డ డివిజన్‌లో 1.49 లక్షల పశువుల ఉండగా 1.3 లక్షల పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశామన్నారు. పశువైద్యాధికారులు సాయిబాబా, రవింద్రారెడ్డి, దీపకుమారి ఉన్నారు.

గుండె ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

• జీజీహెచ్ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు

కర్నూలు హాస్పిటల్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): గుండె ఆరోగ్యంపై ప్రజలు శ్రద్ధ వహించాలని కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు సూచించారు. కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల కార్డియాలజీ విభాగంలో వరల్డ్ హార్ట్ డే వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సూపరింటెండెంట్ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా గుండె జబ్బులు మరణాలకు ప్రధాన కారణాలు అవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరూ సంవత్సరానికి ఒక్కసారి గుండెకు సంబంధించిన పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్డియాలజీ విభాగ వైద్యనిపుణులు డాక్టర్ కిరణ్‌కుమార్ రెడ్డి, డాక్టర్ ప్రశాంత్, డాక్టర్ రాజ్‌కుమార్, డాక్టర్ రవికిరణ్, పీజీలు శ్రీకాంత్, నవాజ్, రవికిరణ్, ప్రణీత్, తనూష్, కార్డియాలజీ టెక్నీషియన్ పాల్గొన్నారు.

జిల్లాలో భారీ వర్షం



కోడుమూరు: కంది పొలంలో నిలిచిన నీరు

• దేవనకొండలో అత్యధికంగా 142.6 మి.మీ. వర్షపాతం నమోదు

• పంటలు నీట మునగడంతో అన్నదాతల ఆవేదన

కర్నూలు అగ్రికల్చర్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మొత్తం అన్ని మండలాల్లో 20మి.మీ మించి వర్షాపాతం నమోదయింది. అత్యధికంగా దేవనకొండలో 142.6 మి.మీ వర్షపాతం నమోదయింది. ఆదోనిలో 126.2 ఎంఎం, మంత్రాలయం 99.4, ఎమ్మిగనూరు 88ఎంఎం, నందవరం 85.6, గోనెగండ్ల 83.6, పెద్దకడుబూరు 76.4, కౌతాళం 66.2, వెల్దుర్తి 65.6, ఆస్పరి 62.2, గూడూరు 59.6, సి.బెళగల్‌లో 58.8, కోడుమూరు 58.2, కల్లూరు 53.6, కర్నూలు అర్బన్‌లో 51.8 వర్షపాతం నమోదయింది. అలాగే కోసిగిలో 50.2 ఎంఎం, కర్నూలు రూరల్ 47.4, హొళగుంద 46.4, పత్తికొండ 46.2, క్రిష్ణగిరి 43.6, ఓర్వకల్లు 42.6, చిప్పగిరి 36.8, హాలహర్వి 34.4, మద్దికెర 31.6, తుగ్గలి 29.2, ఆలూరులో 25.6 మి.మీ వర్షపాతం నమోదయింది. ఖరీఫ్ మొదలైనప్పటి నుంచి ఇప్పటి దాకా ఈస్థాయిలో అన్ని మండలాల్లో 25 ఎంఎం కంటే ఎక్కువ వర్షం నమోదు కావడం ఇదే తొలిసారి అని వ్యవసాయ శాఖ జేడీ వరలక్ష్మి తెలిపారు. జిల్లాలోని అన్ని మండలాల్లో కలిసి సగటున 62 మి.మీ వర్షపాతం నమోదయింది.

చేతికొచ్చిన పంటలు నీటిపాలు

కర్నూలు జిల్లాలో ప్రధాన పంటలన్నీ ప్రస్తుత వర్షాలకు నీటి ముంపునకు గురై చేతికందిన పంటలు నీటిపాలయ్యాయి. తెగుళ్లు, క్రిమికీటకాలు విజృంభించి మరింత నష్టానికి గురి చేస్తున్నాయి. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వాయుగుండంగా మారింది. శనివారం ఒడిశా, చత్తీస్‌ఘడ్ మధ్య తీరం దాటింది. దీంతో రాయలసీమ అంతటా మరో రెండు రోజులు ఎడతెరపి లేని వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరించారు. కలెక్టర్ సిరి కూడా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, జిల్లాలో ప్రవహిస్తున్న తుంగభద్ర, హంద్రీ, వక్కిలేరు తదితర నదుల తీరం వద్దకు వెళ్లవద్దని సూచించారు.

• చేయి చేయి పట్టు.. వంక దాటేటట్టు



కుంభవృష్టి ధాటికి ఊరువాడా వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. వాగులు వంకలు ఏరులై పారుతున్నాయి.. కుంటలు చెరువులు పొంగి పొర్లుతున్నాయి.. దీంతో పలు ప్రాంతాల్లో జనం రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. శనివారం కోసిగి మండలం ఉరుకుంద రోడ్డులో ఉన్న చాపవంకకు వరద పోటెత్తడంతో జనం చేయి చేయి పట్టుకుని అతి కష్టమ్మీద వంక దాటారు.

- కోసిగి, (ఆంధ్రజ్యోతి)

దంచికొట్టిన వర్షం



ఆదోనిలో నీట మునిగిన కౌడలపేట

• జల దిగ్బంధంలో లోతట్టు కాలనీలు
• ఇళ్లలోకి చేరిన వరద
• పొంగిపొర్లిన వాగులు, వంకలు

ఆదోని అగ్రికల్చర్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో శనివారం తెల్లవారుజామున వర్షం దంచి కొట్టింది. భారీ వర్షం కురవడంతో లోతట్టు ప్రాంతా లన్నీ జలమయమయ్యాయి. ఆవుదూడ వంక, మేక వంక, ఆర్టీసీ కాలనీ వెనుక వైపు నుంచి వెళ్లే ప్రధానమైన వంకలు పొంగిపొర్లాయి. ఆర్టీసీ కొత్త బస్టాండ్ వెనుక వంక పొంగి పొర్లడంతో విట్టాకిష్టప్ప నగర్, ఆర్టీసీ కాలనీ, వల్లభ శ్రీ హోమ్స్‌కు వెళ్లే రాకపోకలు నిలిచిపోయాయి. ఆవుదూడ వంక పొంగడంతో కౌడాల్ పేట, షేర్‌ఖాన్ కొట్టాల, బోయగిరి ప్రాంతాల్లో, డీఎస్పీ బంగ్లా సమీపంలో పెద్ద వంకకు భారీ నీరుచేరడంతో లోతట్టు ప్రాంత మైన శివశంకర్ నగర్‌లోని కొన్ని ఇళ్ళలోకి నీరు చేరాయి. కౌడల్‌పేట లోతట్టు ప్రాంతం లో నడుములోతు నీరు రావడంతో ఇళ్లలో నుంచి బయటికి రాని పరిస్థితి ఉండడంతో టీడీపీ రాష్ట్ర నాయకుడు కొంకా భూపాల్ ^ాదరి, మారుతినాయుడు స్పందించి ఆ కాలనీ టీడీపీ నాయకుడు సుబ్బుతో పాల ప్యాకెట్లు, అల్పాహారాన్ని, మధ్యాహ్నం అహారాన్ని సిద్ధపరిచి ఇంటిం టికి వెళ్లి పంపిణీ చేశారు.

బీజేపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు విట్టా రమేష్, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ ఆదూరి విజయ్ కృష్ణ శ్రీనివాసాచారి కొంతమంది శివశంకర్‌నగర్‌లో పర్యటించారు. అక్కడి వారికి ఆహార పొట్లాలు అందజేశారు. తొమ్మిదేళ్ల తర్వాత ఇంతటి భారీ వర్షం రావడంతో రాంజల చెరువు పొంగిపొర్లింది. ఆనీరంతా హౌసింగ్‌బోర్డ్ కాలనీలోకి వచ్చింది. 12.6 సెంటీమీటర్ల (126.8మి.మీ) వర్షపాతం నమోదైంది.

సబ్ కలెక్టర్ పర్యటన

జలమయమైన లోతట్టు ప్రాంతాలు కౌడాల్‌పేట, హౌసింగ్ బోర్డ్ కాలనీ, ఎల్ఐజీ కాలనీలోని, టెలికాంనగర్, బావాజీపేటలోని ఇళ్లలోకి నీరు చేరడంతో సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, మున్సిపల్ కమిషనర్ కృష్ణ పర్యటించారు. వంకలు, కాలువలు ఆక్రమణ లకు గురికావడం విస్మయానికి గురయ్యారు. పారిశాధ్యాన్ని మెరుగుపరి చేందుకు సిబ్బందిని అప్రమత్తం చేశారు.



పొంగి పొర్లుతున్న రాంజల చెరువు



వరదను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్

కమ్మ సంఘాలు సంఘటితమవ్వాలి

• కాకతీయ సేవా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు కొడాలి వెంకట సుబ్బారావు



కర్నూలు కల్చరల్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): కమ్మ సంఘాల ప్రతినిధులు సంఘటితంగా ఉండాలని కాకతీయ సేవా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు కొడాలి వెంకట సుబ్బారావు పిలుపునిచ్చారు. శనివారం నగరంలోని పుష్పరాజ్ కన్వెన్షన్ హాల్‌లో కమ్మ వారి సంఘాల పాలకవర్గ సభ్యుల ప్రాంతీయ సదస్సు జరిగింది. ఈ సదస్సుకు కాకతీయ సేవా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడితో పాటు కార్యదర్శి బెజవాడ వెంకట్రావు, కమ్మసంఘం కర్నూలు జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కమ్మ కృష్ణమోహన్, కర్నూలు సంఘం కార్యదర్శి పెనికలపాటి రాజశేఖర్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కొడాలి వెంకటసుబ్బారావు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో చంద్రబాబును 53రోజులు జైల్లో పెట్టినప్పుడు అక్రమ అరెస్టుకు నిరసనగా రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు, అలాగే 73 దేశాల్లో నిరసన కార్యక్రమాలు సమష్టి కృషితోనే జరిగాయన్నారు. కమ్మవారిని అభివృద్ధి చేసుకోవడంలో భాగంగా ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న వారికి విద్య, హాస్టళ్ల సదుపాయాలు కల్పించడం, నిరుద్యోగులకు పెద్ద సంస్థలకు చెందిన ప్రతినిధులతో చర్చించి ఉద్యోగాలు కల్పించేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. నిరుద్యోగులకు సాఫ్ట్ స్కిల్స్ నేర్పించడం ద్వారా ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, కార్పొరేట్ ఆసుపత్రులతో చర్చించి పేద వర్గాలకు ఆరోగ్యాన్ని కాపాడి సమాజాభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని సూచించారు. త్వరలో రాష్ట్రంలోని అన్ని సంఘాలతో విజయవాడలో భారీ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్‌కు భారతరత్న ఇవ్వాలని సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సమాఖ్య కార్యనిర్వాహక అధ్యక్షుడు మురకొండ బోసుబాబు, ఉపాధ్యక్షుడు కొంకా ఉమాపతి నాయుడు, కార్యదర్శులు మేడసాని చెన్నకేశవ దుర్గాప్రసాద్, తమ్మినేని రమేష్, దూదిపల్లి వెంకటరమణ, సంయుక్త కార్యదర్శి పరుచూరి శ్రీనివాసరావు, అఖిల భారత కమ్మ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కోనేని మల్లికార్జునతో పాటు ప్రతినిధులు పాల్గొన్నారు.

ముగిసిన అంతర్ జిల్లాల జూనియర్స్ షూటింగ్ బాల్ పోటీలు



బాలుర విజేత పల్నాడు జట్టు

కర్నూలు స్పోర్ట్స్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆదర్శ విద్యామందిర్ క్రీడా ప్రాంగణంలో గత రెండు రోజులుగా జరుగుతున్న అంతర్ జిల్లాల రాష్ట్ర స్థాయి జూనియర్స్ షూటింగ్ బాల్ పోటీలు శనివారం ముగిశాయి. గెలుపొందిన జట్లకు ఆంధ్రప్రదేశ్ షూటింగ్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పరుశురాముడు బహుమతులు అందజేశారు. గెలుపు ఓటములు సమానంగా తీసుకోవాలని, చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణిస్తేనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. అత్యంత ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను రాష్ట్ర జట్టుకు ఎంపిక చేసి ఉత్తర్ ప్రదేశ్‌లో జరగబోయే జాతీయస్థాయి పోటీలకు పంపనున్నట్లు తెలిపారు. బాలుర విభాగంలో ప్రథమ విజేతగా పల్నాడు, ద్వితీయ విజేతగా కృష్ణాజిల్లా జట్టు, తృతీయ స్థానంలో నెల్లూరు జట్టు నిలిచిందని తెలిపారు. బాలికల విభాగంలో విజేతగా నెల్లూరు, ద్వితీయ స్థానంలో అన్నమయ్య జిల్లా, తృతీయ సాా్థనంలో కృష్ణా జిల్లాలు నిలిచినట్లు తెలిపారు. సభ్యులు నాగరాజు, ప్రభాకర్, గణేశ్, శ్రీనివాసులు, కిరణ్ కుమార్, సుభాన్‌బాషా, మధుసూదన్, పాల్గొన్నారు.

విద్యార్థుల అ'పూర్వ' సమ్మేళనం

• 40ఏళ్ల తర్వాత పాఠశాలలో కలుసుకున్న స్నేహితులు



డోన్ జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల గురువులతో పూర్వ విద్యార్థులు

డోన్ టౌన్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): నలభై ఏళ్ల క్రితం ఒకే పాఠశాలలో వారందరూ విద్యనభ్యసించారు. ప్రస్తుతం తెలంగాణ, బెంగళూరు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో వివిధ రంగాల్లో, హోదాల్లో స్థిరపడ్డారు. అయినప్పటికీ వారి స్నేహ బంధాన్ని మరువలేరు. ఎలాగైనా కలుసుకోవాలనుకున్నారు. వెంటనే ఒకరికొకరు ఫోన్లు చేసుకుని సమావేశమయ్యారు. డోన్ పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో 1984-85లో పదో తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు పట్టణంలోని తాము చదువుకున్న పాఠశాలలో శనివారం సమ్మేళనం నిర్వహించారు. నాటి మధుర జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. నాడు చదువులు చెప్పిన గురువులైన సుజన ప్రభ, నిర్మలమ్మ, దానమ్మ, వాసు, ప్రభకుమారి, జయరాం, సుబ్బలక్ష్మి, సీతారామయ్య, హిందీ, పీఈటీ టీచర్లను పూల మాలలు, శాలువలతో సన్మానించి వారి ఆశీర్వాదాలు పొందారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. చాలా ఏళ్ల తర్వాత కలుసుకోవడం ఎంతో సంతోషంగా ఉందని పూర్వ విద్యార్థులు అన్నారు. అందరినీ ఒకే తాటిపైకి తెచ్చేందుకు కృషి చేసిన పూర్వ విద్యార్థినులు టి.లక్ష్మీబాయి, నాగరాజకుమారి, హరిప్రియ, గ్రేసీ, తులసిని అభినందించారు.

జిల్లా కోర్టులో వర్క్‌షాప్ ప్రారంభం

• హాజరైన హైకోర్టు న్యాయమూర్తులు

కర్నూలు లీగల్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): నేరారోపణల రిమాండ్.. జీవిత రక్షణ, వ్యక్తిగత స్వేచ్ఛకు సంబంధించిన చట్టాలపై నగరంలోని జిల్లా కోర్టులో శనివారం వర్క్‌షాప్‌ను రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ భానుమతి ప్రారంభించారు. వ్యక్తిగత స్వేచ్ఛకు, నేరారోపణలపై అరెస్టయి ఖైదీల రిమాండ్‌కు సంబంధించిన ప్రొసీజర్లపై ఈ వర్క్‌షాప్ నిర్వహించారు. న్యాయాధికారులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన ప్రొసీజర్లపై హైకోర్టు న్యాయమూర్తి జిల్లాలోని న్యాయాధికారులకు వివరించారు. కార్యక్రమంలో రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ హరిహరనాథ శర్మ, కర్నూలు జిల్లా ప్రధాన న్యాయాధికారి జి.కబర్ది, న్యాయాధికారులు లక్ష్మీరాజ్యం, శ్రీవిద్య, ఎం.శోభారాణి, రాజేంద్రబాబు, శాశ్వత లోక్ అదాలత్ అధ్యక్షుడు వెంకట హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ భానుమతి

రక్తదానంపై అవగాహన కల్పించండి

నంద్యాల రూరల్, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో రక్తదానంపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని జిల్లా పంచాయతీ అధికారి లలితాబాయి సూచించారు. శనివారం పట్టణంలోని టౌన్‌హాల్‌లో పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీ వోలు, డిప్యూటీ ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సిబ్బంది, వైద్యులు పాల్గొన్నారు.


రక్తదానం చేస్తున్న రాంబాబు

పెన్షనర్ల సంఘం జిల్లా కమిటీ ఎన్నిక

నంద్యాల రూరల్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : పెన్షనర్ల సంఘం జిల్లా కమిటీ ఎన్నికలు శనివారం పట్టణంలోని శాంతి భవనంలో నిర్వహించారు. ఏనుగు, బంతి ప్యానళ్ల మధ్య పోరు హోరాహోరీగా కొనసాగింది. ఏనుగు గుర్తు అభ్యర్థి రామసుబ్బయ్య జిల్లా అధ్యక్షుడిగా, మేకల లింగస్వామి జిల్లా ప్రధాన కార్యదర్శిగా గెలుపొందారు. మద్దతుదారులు హర్షం వ్యక్తం చేశారు.

రెవెన్యూ క్రీడలకు రూ.1.50లక్షలు

నంద్యాల ఎడ్యుకేషన్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లాలో నవంబరు 7, 8, 9 తేదీల్లో జరగనున్న 7వ రాష్ట్ర రెవెన్యూ క్రీడా సాంస్కృతికోత్సవాల్లో పాల్గొనున్న జిల్లా రెవెన్యూ ఉద్యోగుల కోసం కలెక్టర్ రాజకుమారి శనివారం రూ.1.50 లక్షల చెక్కును ఏపీఆర్ఎస్ఏ జిల్లా కార్యవర్గానికి అందజేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు కామేశ్వరరెడ్డి, కార్యదర్శి రామచంద్రరావు, రాష్ట్ర కార్యదర్శి శూలం విజయశేఖర్, జిల్లా సహాధ్యక్షులు పత్తిసత్య శ్రీనివాసులు కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

నంద్యాల మున్సిపల్ గేటు వేలం

నంద్యాల టౌన్, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): కూరగాయాల మార్కెట్ గేటు వేలాన్ని శనివారం కమిషనర్ బండి శేషన్న అధ్యక్షతన నిర్వహించారు. వేలందారుడు మహ్మద్ అర్షద్ హుసేన్ ఆరు నెలలకు రూ.23.70 లక్షలకు దక్కించుకున్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషర్ వెంకటదాస్, ఆర్‌వో వెంకటరెడ్డి, ఆర్ఐ యుగంధర్, చరణ్ పాల్గొన్నారు.

'నిరసనలు తెలుపుతూ విధులు నిర్వహించాలి'

పాణ్యం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): తమ డిమాండ్లు నెరవేరే వరకు నిరసనలు తెలుపుతూ విధులు నిర్వహించాలని ఏపీఎస్‌పీఈ జేఏసీ చైర్మన్ కృష్ణయ్య సూచించారు. శనివారం పాణ్యంలో ఆయనకు విద్యుత్ కార్మికులు స్వాగతం పలికారు. కార్యక్రమం లో వర్కింగ్ ప్రెసిడెంట్ జగదీశ్, భాస్కర్, మస్తాన్, సెక్షన్ ఉద్యో గులు, కార్మికులు పాల్గొన్నారు.

ఉరుసు ప్రారంభం

ఆత్మకూరు, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని హజరత్ సయ్యద్‌హబీవుల్లాషా ఖాద్రి దివాన్‌షావలి (తిక్కయ్యస్వామి) ఉరుసు శనివారం ప్రారంభమైంది. మూడు రోజుల పాటు జరిగే మహోత్సవంలో ఆదివారం ఉరుసు నిర్వహించనున్నారు. సోమవారం జియారత్ పాతేహా సందర్భంగా స్వామిజీకి అంత్యపూజలు చేసి ఉత్సవానికి ముగింపు పలుకుతారు. దర్గా ప్రాంగణం భక్తులతో కిక్కిరిసిపోతోంది.

అమ్మవారి ప్రత్యేక పూజలు

● కొనసాగుతున్న శరన్నవరాత్రి ఉత్సవాలు


నంద్యాల, ఆత్మకూరు, నందికొట్కూరు, పాణ్యం నియోజకవర్గాల పరిధిలోని శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా ఆలయాలు, మండపాల్లో అమ్మవారు వివిధ రూపాల్లో దర్శనమిచ్చారు. అర్చకులు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. అనంతరం భక్తులు దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

● ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్


పాణ్యం: లలితా త్రిపుర సుందరిదేవిగా..


పాములపాడులో..


ఆత్మకూరు: వేంకటేశ్వరస్వామి అలంకరణలో వాసవీమాత


నందికొట్కూరు: రాజరాజేశ్వరి దేవిగా..


గడివేముల: కాత్యాయని దేవిగా..


జూపాడుబంగ్లా: లలితా త్రిపురసుందరిగా..


కొత్తపల్లి: లలితా త్రిపుర సుందరిగా..


నంద్యాల కల్చరల్: జగజ్జననీమాత ఆలయంలో ప్రత్యేక పూజలలో పాల్గొన్న భక్తులు


నంద్యాల కల్చరల్ : సంజీవనగర్ రామాలయంలో అన్నపూర్ణ దేవిగా..


నంద్యాల కల్చరల్: అమ్మవారిశాలలో క్రిష్ణమాయి దేవి


నంద్యాల కల్చరల్: మద్దిలేటి స్వామి ఆలయంలో లలితాత్రిపురసుందరిగా..

వీడని వర్షాలు

- ఉప్పొంగిన వాగులు, వంకలు
- స్తంభించిన రాకపోకలు
- పొలాలకు తీవ్ర నష్టం
- ప్రజలను అప్రమత్తం చేస్తున్న పోలీసులు

ఆత్మకూరు, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి ప్రభావంతో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ఆత్మకూరులో వర్షం కురియడంతో ప్రధాన రహదారులపై నీరు నిలిచి ప్రజలు అసౌకర్యానికి గురయ్యారు. సిద్దాపురం చెరువు అలుగు పారుతోంది. దాంతో వాహనాల రాకపోకలను పోలీసులు నిలిపివేశారు. ఆత్మకూరు నుంచి దోర్నాలకు వెళ్లే వాహనాలను నంద్యాల టర్నింగ్ నుంచే నంద్యాల, గిద్దలూరు మీదుగా మళ్లిస్తున్నారు. అలాగే ఆత్మకూరు నుంచి వడ్లరామాపురం గ్రామానికి వెళ్లే రహదారిపై పీతురువాగు ఉప్పొంగడంతో ఆ గ్రామానికి రాకపోకలు స్తంభించాయి. అంతే కాకుండా నల్లమలలోని మునిమడుగుల వాగుపై నిర్మించిన వరదరాజ స్వామి ప్రాజెక్ట్‌లో గరిష్ఠ స్థాయిలో నీటినిల్వలు చేరడంతో ఆ నీరంతా భవనాశి నదిలో చేరడంతో ఆత్మకూరు పట్టణ శివార్లలో నది ప్రవాహం ఉగ్రరూపం దాల్చింది. దాంతో పలు గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. భవనాశి నది సమీపంలోని ఇటుకల బట్టీల ప్రాంతాన్ని కూడా వరద జలాలు ముంచెత్తాయి. ఆత్మకూరు అర్బన్ సీఐ రాము కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. మొక్కజొన్న, పత్తి పంట పొలాల్లో వర్షపునీరు నిలిచి పంటలు దెబ్బతిన్నాయని రైతులు వాపోతున్నారు.


ఆత్మకూరు శివారులో ఉప్పొంగి ప్రవహిస్తున్న భవనాశి నది


మహానందిలో పొంగి ప్రవహిస్తున్న పాలేరు వాగు


కొత్తపలిల్లో ట్రాక్టర్ ద్వారా వాగు దాటుతున్న ప్రజలు

మహానంది: మండలంలో మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు వాగులు,వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. పాలేరు వాగు, బుక్కాపురం అలుగు నీరు ప్రధాన రహదారిపై ప్రవహించాయి. దీంతో నంద్యాల నుంచి మహానందికి రాకపోకలు నిలిచిపోయాయి. తిమ్మాపురం జడ్పీ పాఠశాలలో పురాతన భారీ వృక్షం నేలకూలింది. అబ్బీపురం చెంచు కాలనీల్లోని ఇళ్లల్లోకి వరదనీరు చేరింది. ఎంపీపీ యశస్వీని, ఎంపీడీవో మహమ్మద్ దౌలాతో పాటు అధికారులు పర్యటించారు. ఎంపీపీ వరద బాధితులకు ఆర్థిక సాయం అందజేశారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. బుక్కాపురం అలుగును ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డి పరిశీలించారు.

కొత్తపల్లి: మండలంలో శుక్రవారం రాత్రి నుంచి శనివారం ఉదయం వరకు కురిసిన భారీ వర్షానికి 57.0 మీ.మీల వర్షపాతం నమోదైంది. శివపురం ఎద్దులేరు వాగుపై వరద ఉధృతి కొనసాగుతోంది. కొత్తపల్లి పోలీసులు వాగువద్దనే కాపాలా ఉండి ఎలాంటి ప్రమాదాలు చోటు చేసుకోకుండా ట్రాక్టర్ ద్వారా ఆవలి ఒడ్డుకు గ్రామస్థులను చేరుస్తున్నారు.

అప్రమత్తంగా ఉండాలి

నంద్యాల రూరల్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నంద్యాల రూరల్ తహసీల్దారు శ్రీవాణి సూచించారు. శనివారం మండలంలోని పెద్దకొట్టాల బీసీ కాలనీలో ఆర్ఐ మాధవిరెడ్డి, డిప్యూటీ తహసీల్దారు రామచంద్రరావుతో కలిసి పర్యటించారు. వాగులు, వంకల్లో ప్రవహిస్తున్న వరద నీటిని పరిశీలించారు.

పగిడ్యాల: కృష్ణనది తీర గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నందికొట్కూరు రూరల్ సీఐ సుబ్రమణ్యం సూచించారు. మండల పరిధిలోని నెహ్రూనగర్ గ్రామ సమీపంలోని మూర్వకొండ ఘాట్ వద్ద నదీజలాలను ఆయన శనివారం సాయంత్రం పరిశీలించారు.

స్మార్ట్ కార్డులు పంపిణీ చేయాలి

నంద్యాల రూరల్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : వచ్చేనెల 1 లోగా స్మార్ట్ కార్డులు పంపిణీ చేయాలని నంద్యాల రూరల్ తహసీల్దారు శ్రీవాణి ఆదేశించారు. శనివారం రూరల్ తహసీల్దారు కార్యాలయంలో ఈ పాసు మిషన్లపై రేషన్ డీలర్లకు అవగాహన కల్పించారు. సమావేశంలో రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

రైతుల అండగా ప్రభుత్వం

కొత్తపల్లి, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని టీడీపీ మండల కన్వీనర్ లింగస్వామి గౌడు అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ దెబ్బతిన్న మొక్కజొన్న, పత్తి, మునగ తదితర పంటలను వ్యవసాయాధికారులు పరిశీలించారన్నారు. నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకునేందుకు సిద్ధంగా ఉందన్నారు.

అవగాహన ఉండాలి

పాణ్యం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహారంపై అవగాహన ఉండాలని శాంతిరాం వైద్యకళాశాల కమ్యూనిటీ మెడిసిన్ విభాగం హెచ్‌వోడీ ముష్తాఖ్ పాషా, అప్సర్ పాతిమాలు సూచించారు. శనివారం పాణ్యం బీసీ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో స్వస్థ్ నారీ స్వశక్త్ పరివార్ కార్యక్రమంలో భాగంగా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యు లు శ్రీగౌరి, దీప్తి, తనూజ, మాధురిరెడ్డి, హారిక, చంద్రహాసరెడ్డి, శిరీష, సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటిపై ఆర్సీ టెస్ట్

నంద్యాల టౌన్ సెప్టంబర్ 27(ఆంధ్రజ్యోతి): నంద్యాల పట్టణంలోని పలు ప్రాంతాల్లో మున్సిపల్ కమిషనర్ తాగునీటిపై ఆర్సీ టెస్ట్ నిర్వహించారు. శనివారం ఎస్‌బీఐ కాలనీ, ఎన్జీవో కాలనీ, టెక్కె వంటి ప్రాంతాల్లో ప్రజల ఇళ్ల వద్దకు వెళ్లి తాగునీరు మంచిగా వస్తుందా..? లేదా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆర్సీ టెస్ట్ నిర్వహించారు. కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

రేపు లోక కల్యాణ్ మేళా

నంద్యాల టౌన్ సెప్టంబర్ 27(ఆంధ్రజ్యోతి): కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మార్గదర్శకాల ప్రకారం ఈనెల 29న లోక కల్యాణ్ మేళా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కమిషనర్ బండి శేషన్న శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒక కుటుంబం ఒక పారిశ్రామిక వేత్తలో భాగంగా చిరు వ్యాపారులకు అండగా ఈ కార్యక్రమాన్ని పురపాలక కార్యాలయంలో నిర్వహిస్తామన్నారు. బ్యాంకు మేనేజర్లు, లాయర్లు, వైద్యులు, వీధి విక్రయ సభ్యులు పాల్గొంటారని తెలిపారు.

వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలి

ఆత్మకూరు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలని సీపీఎం నాయకులు రణధీర్ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక ఆ పార్టీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. నాయకులు రామ్ నాయక్, సురేంద్ర, నాగేశ్వరరావు, వీరన్న, భాస్కర్ తదితరులున్నారు.

ఘనంగా పర్యాటక దినోత్సవం

నంద్యాల నూనెపల్లి, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని పర్యాటక ప్రదేశాల్లో ప్రపంచ పర్యాటక దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించినట్లు పర్యాటక శాఖ జిల్లా ఇన్‌చార్జి అధికారి నాగరాజు తెలిపారు. కార్యక్రమాల్లో పర్యాటక శాఖ అడ్మిన్ సి.నాగార్జున రావు, యూనిట్ల మేనేజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతలకు సన్మానం

నంద్యాల కల్చరల్, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయిలో అవార్డులు అందుకున్న ఉత్తమ ఉపాధ్యాయులు అవ్వారి శేషఫణి, పీవీ సుబ్బయ్యలను సన్మానించారు. శనివారం పట్టణంలోని రైతు సమాఖ్య కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో మాతృభాషా పరిరక్షణ సమితి అధ్యక్షుడు డాక్టర్ దివి హయగ్రీవాచార్యులు సన్మానించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త డాక్టర్ రవీంద్రనాథ్, చిన్నయసూరి సాహితీ సమితి అధ్యక్షులు డా. వైష్ణవ వెంకటరమణమూర్తి, ఉపాధ్యాయం సంఘం నాయకులు ముత్తోజు వీరబ్రహ్మం, వివిధ సామాజిక, సాహితీ సంస్థల ప్రతినిధులు అన్నెం శ్రీనివాసరెడ్డి, కిషోర్‌కుమార్, డా.నీలం వెంకటేశ్వర్లు, మాబుబాషా, నీలకంఠమాచారి, నంది రైతు సమాఖ్యప్రతినిధులు, కృష్ణారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, ఉపాధ్యాయులు నరేంద్ర, ప్రసాద్, బాలసుబ్బయ్య పాల్గొన్నారు.


ఉపాధ్యాయులను సన్మానిస్తున్న సాహితీ సంస్థల ప్రతినిధులు

రైతులను ఆదుకోవాలి

నందికొట్కూరు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): తీవ్ర వర్షాల వల్ల నష్టపోయిన పత్తి, మిరప, ఉల్లి, మొక్కజొన్న రైతులను ఆదుకోవాలని సీపీఐఎంఎల్ లిబరేషన్ జిల్లా కార్యదర్శి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని సీపీఐ (ఎంఎల్)లిబరేషన్ కార్యాలయంలో జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎకరాకు రూ.40 వేలు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ నాయకులు గ్యాబ్రియేలు, నాయకులు నాగేశ్వరరావు, కుమారి మేరి, సావిత్రి, రామకృష్ణ, షేక్షావలి, సామన్న, లింగాల శ్రీనివాసులు పాల్గొన్నారు.

టీడీపీ అనుబంధ కమిటీల ఎంపిక

పాములపాడు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): టీడీపీ మండల అనుబంధ విభాగాల కమిటీల అధ్యక్షులను ఎన్నుకున్నట్లు పార్టీ మండలాధ్యక్షుడు రవీంద్రారెడ్డి శనివారం తెలిపారు. బీసీ సెల్ మండల అధ్యక్షుడిగా కంభం మోహన్‌గౌడ్ (వేంపెంట), ఎస్సీసెల్ అధ్యక్షుడిగా లింగాల నాగరాజు (మిట్టకందాల), ఎస్టీసెల్ అధ్యక్షుడిగా సోమల్ నాయక్ (గుండాలనట్టు, వేంపెంట), తెలుగు మహిళాఅధ్యక్షురాలుగా తెలుగు గంగమ్మ(ఎర్రగూడూరు), తెలుగు రైతు సంఘం అధ్యక్షుడిగా గజ్జల భాస్కర్ రెడ్డి(బానకచర్ల), టీఎన్‌టీయూసీ అధ్యక్షుడిగా జడల నాగ రాజు (రుద్రవరం), తెలుగు సాంస్కృతిక అధ్యక్షుడిగా వినోద్ కుమార్(బద్దనగర్, మిట్టకందాల), మైనార్టీ సెల్ అధ్యక్షులుగా మాలిక్ భాష(మద్దూరు) నియమితులయ్యారు. ఆయా కమిటీల అధ్యక్షులు సమన్వయంతో పని చేసి పార్టీ అభివృద్ధి కోసం కృషి చేయాలని రవీంద్రారెడ్డి ఆదేశించారు.

మహిళలు, చిన్నారులపై పెరిగిన దాడులు

నంద్యాల రూరల్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : దేశంలో, రాష్ట్రంలో మహిళలు, చిన్నారులపై దాడులు పెరుగుతు న్నాయని వీటిని అరికట్టడంలో ప్రభుత్వాలు విఫలమౌతున్నాయని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం(ఐద్వా) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కంకణాల రమాదేవి అన్నారు. శనివారం పట్టణంలోని రామకృష్ణ డిగ్రీ కళాశాలలోని వివేకానంద ఆడి టోరియంలో ఐద్వా పట్టణస్థాయి జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో నంద్యాల జిల్లా అధ్యక్షురాలు నిర్మల, సీఐటీయూ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు లక్ష్మణ్, కె.మహమ్మద్ గౌస్, నాయకురాలు హైమావతి, లతితమ్మ పాల్గొన్నారు.

డీఐజీని కలిసిన అభిరుచి మధు

నంద్యాల నూనెపల్లి, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : కర్నూలులో డీఐజీ కోయ ప్రవీ ణ్‌ను బీజేపీ జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు మర్యాద పూర్వ కంగా కలిశారు. ప్రధాన మం త్రి నరేంద్ర మోదీ అక్టోబరు 16న కర్నూలు, నంద్యాల జిల్లాలో పర్యటిస్తున్న నేపథ్యంలో డీఐ జీని కలిశారు. మోదీ ముం దుగా కర్నూలులో రోడ్ షో, అనంతరం నంద్యాల జిల్లా శ్రీశైలం మల్లన్నను దర్శిం చుకొని పలు అభివృద్ధి పనులకు శ్రీకా రం చుట్టనున్నట్లు వివరించారు.


డీఐజీకి పుష్పగుచ్ఛం అందిస్తున్న అభిరుచి మధు

అందరికీ వైద్యం ప్రభుత్వ ధ్యేయం

మహానంది, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరికి వైద్యం అందించాలన్నదే ప్రభుత్వ ధ్యేయమని వైద్యాధికారి భగవాన్‌దాస్ అన్నారు. శనివారం తిమ్మాపురం పీహెచ్‌సీలో వైద్యశిబిరం నిర్వహించారు. వైద్యాధికారి వేణు కార్తీకేయ, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

నష్ట పరిహారం చెల్లించకపోతే రిలే దీక్షలు

నందికొట్కూరు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మొక్కజొన్న నకిలీ విత్తనాల వల్ల నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించకపోతే రిలే నిరాహార దీక్షలు చేపడతామని రైతు సంఘం నాయకుడు రవిశెట్టి, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు నాగేశ్వరరావు హెచ్చరించారు. శనివారం పట్టణంలో మొక్కజొన్న నకిలీ విత్తనాల వల్ల నష్టపోయిన రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూడు రోజులుగా ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్నా అటు అధికారులు, ఇటు దుకాణం యజమానులు రైతులను మభ్యపెట్టే ధోరణితో వ్యవహరిస్తున్నారన్నారు. ఆదివారంలోగా నష్టపరిహారం చెల్లించకుంటే సోమవారం నుంచి రిలే నిరాహారదీక్షలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు పక్కీర్ సాహెబ్, గోపాలకృష్ణ, రైతు సంఘం నాయకులు రమణారెడ్డి, శ్రీరామ్‌రెడ్డి, మహబూబ్ బాషా పాల్గొన్నారు.

కార్యాలయం వద్ద రైతుల పడిగాపులు

వ్యవసాయ కార్యాలయం వద్ద రైతులు శనివారం పడిగాపులు కాశారు. శుక్రవారం శాస్త్రవేత్తలు పరిశీలించగా, విత్తన దుకాణం యజమాని నష్టపరిహారం చెల్లిస్తానని అధికారుల సమక్షంలో ఒప్పుకున్నారు. దీంతో శనివారం ఉదయం రైతుల తమ పొలాల వివరాలు తెలిపేందుకు వ్యవసాయశాఖ మండల కార్యాలయం వద్దకు చేరుకున్నారు. కాని ఏవో షేక్షావలి సెలవులో ఉండడంతో రైతులకు సమాధానం చెప్పే వారే కరువయ్యారు. దీంతో రోజంతా రైతులు నిరీక్షించాల్సి వచ్చింది.

మద్దతుగా నిలిచిన సీడ్స్ దుకాణాల యజమానులు

నకిలీ విత్తనాలను అందజేసిన పల్లవి సీడ్స్ దుకాణానికి పట్టణంలోని విత్తనాల దుకాణాల యజమానులు మద్దతుగా నిలిచారు. వివిధ కంపెనీలు తయారు చేసిన విత్తనాలను రైతులకు అందజేస్తామే తప్పా... తాము తయారు చేయం కాదా అని అన్నారు. శనివారం పట్టణంలోని తమ దుకాణాలను బంద్ చేసి తమ సమస్యను జేడీఏకు వివరించేందుకు నంద్యాలకు వెళ్లారు. వ్యవసాయశాస్త్రవేత్తల పరిశీలనలో నకిలీ విత్తనాలతోనే పంట నష్టం జరిగిందంటే ఆయా కంపెనీల ప్రతినిధులను పిలిపించి మాట్లాడతామన్నారు. వారు స్పందించకపోతే రైతుల పక్షాన నిలబడి ఆయా కంపెనీలపై కేసులు నమోదు చేస్తామన్నారు.





డోన్ అభివృద్ధిపై పుస్తకావిష్కరణ


పుస్తకావిష్కరణ చేస్తున్న వైసీపీ నాయకులు

డోన్ రూరల్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): డోన్ నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిపై వైసీపీ నాయకులు శనివారం పార్టీ కార్యాలయంలో పుస్తకావిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. 2019-24 ఐదు సంవత్సరాల కాలంలో వైసీపీ ప్రభుత్వంలో అప్పటి ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి డోన్ నియోజకవర్గంలో చేసిన అభివృద్ధిని విద్యార్థులకు అవసరమైన పుస్తక రూపంలో రూపొందించినట్లు డోన్ ఎంపీపీ రేగటి రాజశేఖర్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, రాష్ట్ర మీట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ శ్రీరాములు అన్నారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు, పార్టీ జిల్లా వలంటరీ విభాగం అధ్యక్షులు పోస్టు ప్రసాద్, జడ్పీటీసీ సభ్యులు బద్దల రాజ్‌కుమార్, పార్టీ మండల అధ్యక్షుడు సోమేష్ యాదవ్, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ రామచంద్రుడు, మున్సిపల్ వైస్ చైర్మన్ జాకీర్ హుశేన్ పాల్గొన్నారు.

విద్యపై అవగాహన పెంచుకోవాలి

ఉయ్యాలవాడ, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ నుండే వృత్తి విద్య కోర్సులపై అవగాహన కలిగి ఉండాలని మన గ్రోమోర్ మేనేజర్ ప్రసాద్ తెలిపారు. శనివారం స్థానిక మన గ్రోమోర్ సెంటర్‌లో ఒకేషనల్ ట్రైనర్ వెంకటరమణ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఎరువుల గురించి అవగాహన కల్పించారు.

వైభవంగా లక్ష కుంకుమార్చన


కుంకుమార్చన చేస్తున్న మహిళలు

చాగలమర్రి, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలోని గ్రామ దేవత చాగలమ్మ ఆలయంలో దసరా ఉత్సవాల సందర్భంగా వేద పండితులు పుల్లయ్య, చిన్న శాస్త్రీ, కమిటీ సభ్యులు నరసింహారెడ్డి, రామసుబ్బారెడ్డిల ఆధ్వర్యంలో మహిళలచే వైభవంగా శనివారం లక్ష కుంకుమార్చన చేయించారు.

రుద్రవరం:మండలంలోని వాసాపురంలో శనివారం లక్ష్మీగోదాదేవి వెంకటేశ్వరస్వామి మానస లింగేశ్వరస్వామి త్రిపుర సుందరీదేవి అమ్మవార్లకు అర్చకులు వారణాసి గోపిశర్మ, శివశర్మలు అభిషేకం చేసి వేదమంత్రోచ్చారణల మధ్య పూజలు ప్రారంభించారు.

దొమ్మరి కులాన్ని బలిజల్లో చేర్చడం తగదు


తహసీల్దారు ప్రసాద్‌బాబుకు వినతి పత్రం ఇస్తున్న బలిజ సంఘం నాయకులు

ఉయ్యాలవాడ, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): దొమ్మరి కులాన్ని గురి బలిజలుగా మారుస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవో నెం: 5ను వెంటనే రద్దు చేయాలని ఉయ్యాలవాడ మండల బలిజ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. శనివారం కమతం బజారులో ఉన్న శ్రీకృష్ణదేవరాయలు విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ర్యాలీగా బయలుదేరి రెవెన్యూ కార్యాలయానికి చేరుకొని తహసీల్దారు ప్రసాద్‌బాబుకు వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో బలిజల మండల అధ్యక్షుడు నడిపి వెంకటసుబ్బయ్య, తాలూకా సభ్యుడు అర్విగారి నరసింహుడు, సాగునీటి సంఘం అధ్యక్షుడు ఆకుల చిన్న సుబ్బయ్య, బలిజ సంఘం మండల ఉపాధ్యక్షుడు బళ్లారి ఉశేనయ్య, నాయకులు పాల్గొన్నారు.

స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ

కోవెలకుంట్ల, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెలగటూరు గ్రామంలో టీడీపీ నాయకుడు ధనుంజయుడు వీఆర్వో ప్రవీణ్‌తో కలిసి కొత్త స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేశారు. మంత్రి బీసీ జనార్ధనరెడ్డి ఆదేశాల మేరకు తహసీల్దారు పవన్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో అన్ని గ్రామాల్లో స్మార్ట్‌కార్డులు చేస్తున్నామని తెలిపారు.

మహిళా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

చాగలమర్రి, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మహిళల ఆరోగ్య సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఎంఎల్‌హెచ్‌పీ సురేంద్రబాబు తెలిపారు. శనివారం ఆర్సీఎం పాఠశాలలో స్వస్తునారి స్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా వైద్య ఆరోగ్యశాఖ ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేసింది. ఈ శిబిరంలో వివిధ వ్యాధులపై మహిళలకు అవగాహన కల్పించి మందులను పంపిణీ చేశారు.

ఉపాధ్యాయ సమస్యలపై నిరంతర పోరాటం

శిరివెళ్ల, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలపై నిరంతరం పోరాడుతున్నట్లు ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి శివయ్య చెప్పారు. ఏపీటీఎఫ్ శిరివెళ్ల మండల నూతన కార్యవర్గాన్ని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నామన్నారు. అధ్యక్షులుగా మహేశ్వరరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా వెంకటేశ్వర్లుతోపాటు పలువురిని ఉపాధ్యక్షులుగా, కార్యదర్శులుగా ఎన్నుకుని ప్రమాణస్వీకారం చేయించారు.

రేబిస్ వ్యాధితో అప్రమత్తంగా ఉండండి

సంజామల,సెప్టెంబరు 27,(ఆంధ్రజ్యోతి): పెంపుడు జంతువుల వలన సోకే రేబిస్ వ్యాధితో అప్రమత్తంగా ఉండాలని పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకులు కొండారెడ్డి విద్యార్థులను కోరారు. శనివారం సంజామల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపల్ సాలెహ అధ్యక్షతన విద్యార్థులకు రేబిస్ వ్యాధిపట్ల అవగాహన కల్పించారు. వెటర్నరీ ఏ.డి మాట్లాడుతూ రేబిస్ వ్యాధి కుక్కలు, పిల్లులు పెంచుకోవడం ద్వారా సంక్రమిస్తుందన్నారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి కృష్ణమోహన్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆగని..వర్షం

- చెరువులను తలపిస్తున్న పొలాలు
- కూలిపోతున్న మట్టి మద్దెలు, గుడిసెలు
- పలు గ్రామాలకు రాకపోకలు బంద్

మూడు రోజుల నుంచి ఎడతెరిపిలేకుండా వర్షాలు కురుస్తున్నాయి. వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. పొలాలు చెరువులను తలపిస్తున్నాయి. కొన్ని గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. మట్టి మిద్దెలు, గుడిసెలు కూలిపోయాయి. వర్షాలతో తీవ్రంగా నష్టపోతున్నామని, ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు, స్థానికులు కోరుతున్నారు.


నేలంపాడు గ్రామ సమీపంలో నీట మునిగిన మొక్కజొన్న పంట


శిరివెళ్ల: ఉధృతంగా ప్రవహిస్తున్న మాలమాగు వాగు

ఉగ్ర కుందూ

ఉయ్యాలవాడ, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని రూపనగుడి గ్రామ సమీపంలో ఉన్న వంతెన వద్ద కుందూనది ఉగ్రరూపం దాల్చింది. శనివారం ఎగువ ప్రాంతం నుంచి భారీగా వరద వచ్చి చేరింది. దీంతో కుందూ తీర ప్రాంత రైతులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. విద్యుత్ మోటార్ల వద్దకు వెళ్లకూడదన్నారు. ఇప్పటికే 10 అడుగుల ఎత్తుకు నీరు వచ్చి చేరినట్లు తహసీల్దారు ప్రసాద్‌బాబు తెలిపారు. వంతెన వద్ద తమ వీఆర్వోలను కాపలా ఉంచినట్లు ఆయన తెలిపారు.


కుందూ నదిలో ప్రవహిస్తున్న వరద

కూలిన పోలీస్ క్వార్టర్ గోడ

బనగానపల్లె, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): బనగానపల్లె పట్టణంలోని ఉన్నతపాఠశాల మైదానం సమీపంలోని పోలీస్‌క్వార్టర్ గోడ ఇటీవల కురిసిన తుపాన్‌కు శనివారం కూలిపోయింది. పోలీస్‌క్వార్టర్లు ప్రస్తుతం శిథిలావస్థలో ఉన్నాయి. కొందరు పోలీస్ సిబ్బంది, హోంగార్డులు ఈక్వార్టర్లలోని బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. కూలిపోయిన ప్రాంతంలో ఎవ్వరూ లేకపోవడంతో ఎవరికీ ప్రమాదం సంభవించలేదు.


బనగానపల్లెలో కూలిన పోలీస్ క్వార్టర్స్ గోడ

రాకపోకలకు ఆటంకం

శిరివెళ్ల: రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో జనజీవనం స్తంభించిపోయింది. శిరివెళ్ల-రుద్రవరం ప్రధాన రహదారిలోని మాలమాగు వాగు, వక్కిలేరు వాగులో వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తుండడం తో అధికారులు అప్రమత్తమై రుద్రవరం మండలంలోని పలు గ్రామాలకు రాకపోకలను నిలిపివేశారు. పోలీసు, రెవెన్యూ సిబ్బంది వాగు వద్ద బందోబస్తు నిర్వహిస్తున్నారు.

నీటిలోనే పొలాలు

చాగలమర్రి: మండలంలో ఎడతెరిపిలేని వర్షం శనివారం కురిసింది. ముసురు వానతో పంటలు దెబ్బతిని రైతులకు తీరని నష్టం వాటిల్లింది. గొట్లూరు, నేలంపాడు, రాంపల్లే, బ్రాహ్మణపల్లె, కలుగొట్లపల్లె గ్రామాల సమీపంలో రైతులు సాగు చేసిన మొక్కజొన్న, బెండ, మినుము, జూట్, కంది పంటలు నీట మునిగాయి. 900 ఎకరాల దాక పంటలు దెబ్బతిని లక్షలాది రూపాయలు నష్టం వాటిల్లిందని రైతులు ఆవేదన చెందుతున్నారు.

58 మి.మీ. వర్షపాతం నమోదు

బనగానపల్లె, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): బనగానపల్లె మండలంలో శనివారం 58 ఎం.ఎం. వర్షం నమోదయింది. ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షం వల్ల రైతులు ప్రస్తుతం ఇబ్బందులు పడుతున్నారు. కారణం మొక్కజొన్న పంటను కోసే సమయంలో ఈవర్షాలు కురుస్తుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మరికొందరు మొక్కజొన్న పంటను కొన్ని గ్రామాల్లో మొదలు పెట్టగానే తుఫాన్ రూపంలో వర్షం రావడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కోవెలకుంట్ల మం డలంలో 32 ఎంఎం. వర్షపాతం, అవుకు మండలంలో 11.4 ఎంఎం. కొలిమిగుండ్ల మండలంలో అతితక్కువగా 1.2 ఎంఎం. వర్షపాతం నమోదయింది. గ్రామాల్లో వర్షపునీరు నిల్వ ఉండడంతో దోమలు వృద్ధి చెంది విషజ్వరాలు ప్రబలుతున్నాయి. భారీ వర్షాలకు రోడ్లు దెబ్బతిన్నాయి.


రుద్రవరం మండలం ఎర్రగుడిదిన్నె సమీపంలో పొంగి ప్రవహిస్తున్న నది

కోవెలకుంట్ల, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మూడురోజులుగా వర్షాలు కురుస్తుండడంతో లింగాల- వల్లంపాడు మధ్య ఉన్న చిన్నవంతెన వాగు, కుందూ ఉధృతంగా ప్రవహిస్తుంది. రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. కోవెలకుంట్ల నుంచి వల్లంపాడు మీదుగా నంద్యాలకు వెళ్లే ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు.


ఉధృతంగా ప్రవహిస్తున్న కుందూ నది


గొట్లూరు గ్రామ సమీపంలో నీట మునిగిన జూట్ పంట

నష్టపోయాం.. ఆదుకోవాలి


దెబ్బతిన్న మొక్కజొన్నను చూపిస్తున్న రైతులు

చాగలమర్రి: తుఫాన్ ప్రభావంతో భారీగా నష్టపోయామని గొట్లూరు గ్రామంలో నీట మునిగిన మొక్కజొన్నను చూపిస్తూ రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. భారీ వర్షాల వల్ల మొక్కజొన్న వరద నీటితో కుళ్లిపోయి దెబ్బతిందని రైతులు వాపోయారు. 400 ఎకరాల దాక మొక్కజొన్న చేతి కందే సమయంలో దెబ్బతినిందని అన్నారు. పంట నష్టపరిహారం అందించి ఆదుకోవాలని రైతులు కోరారు.

కూలిన మట్టిమిద్దె


కూలిన మట్టి మిద్దె

బేతంచెర్ల: ఎడతెరపి లేకుండా వర్షాలు కురుస్తుండటంతో బేతంచెర్ల మండలంలోని కొలుములపల్లె గ్రామంలో గత రాత్రి మట్టిమిద్దె కూలింది. ఈ ప్రమాదంలో ఇంటి నివాసితురాలైన వృద్ధ హుశేన్ దంపతులు అప్రమత్తమై ప్రాణాలతో బయటపడ్డారు. వ్యవసాయ సామగ్రి, పొలంలో బోరు పైపులు, వంట సామగ్రి, మూడు బస్తాల బియ్యం, ఒక బస్తా జొన్నలు మట్టిలో కూరుకుపోయి రూ.1.50 లక్షల నష్ట జరిగిందని బాధితుడు వాపోయాడు.

పొంగిన వకుళానది

రుద్రవరం: నల్లమల అటవీలో భారీ వర్షం కురియడంతో వకుళానది, చిన్నేరువాగునది శనివారం పొంగి ప్రవహిస్తుంది. చిలకలూరు, ఎర్రగుడిదిన్నె, పేరూరు గ్రామాలకు సమీపంలో ఉన్న నేల వంతెనలపై వర్షం నీరు పొంగిప్రవహించింది. ఆ మూడు గ్రామాలకు రాకపోకలు బంద్ అయ్యాయి. అలాగే రుద్రవరం - నంద్యాల ఆర్టీసీ బస్సులు కూడా నిలిపివేశారు.


రుద్రవరం మండలం పేరూరు సమీపంలో పొంగి ప్రవహిస్తున్న వకుళానది

డోన్‌ను సస్యశ్యామలం చేస్తా

● ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి

డోన్ టౌన్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): డోన్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి సస్యశ్యామలం చేస్తామని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని జడ్పీ అతిథి గృహం ఎదురుగా ఉన్న ముఖ్యమంత్రి కోట్ల విజయభాస్కర్ రెడ్డి 24వ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

● పట్టణంలోని కేవీఎస్ కాలనీలో డీలర్ మధుసూదన్ గుప్తా షాపులో ప్రభుత్వం ఏర్పాటు చేసిన డిజిటల్ రేషన్ షాపుల వద్ద రేషన్ కార్డుదారులకు డిజిటల్ రేషన్ కార్డును ఎమ్మెల్యే కోట్లతో పాటు కేడీసీసీ చైర్మన్ వై.నాగేశ్వరరావు యాదవ్, ఆర్డీవో కేపీ నరసింహులు, తహసీల్దార్ రవికుమార్, మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌గౌడులతో కలిసి డిజిటల్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు.

● ఎమ్మెల్యే కార్యాలయం వద్ద ఇటీవల అసెంబ్లీలో బేడ బుడగ జంగాలను ఎస్సీ జాబితాలో చేర్చాలనే అంశంపై అసెంబ్లీలో ప్రస్తావించడంతో పట్టణానికి చెందిన బేడ, బుడగ జంగాలు ఎమ్మెల్యే కోట్లను ఘనంగా సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే కోట్ల మాట్లాడుతూ డోన్‌ను అభివృద్ధి చేసేందుకు తమ వంతుగా కృషి చేస్తానన్నారు.

● దసరా దేవి శరన్నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని అమ్మవారిశాలలో వాసవి కన్యకా పరమేశ్వరికి ఎమ్మెల్యే కోట్ల ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు కోట్రికే ఫణిరాజ్, వలసల రామకృష్ణ, లక్కసాగరం లక్ష్మిరెడ్డి, ఓబులాపురం శేషిరెడ్డి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ టీఈ కేశన్నగౌడు, మాజీ ఎంపీపీ శేషఫణిగౌడు, కమలాపురం సర్పంచ్ రేగటి అర్జున్ రెడ్డి, మండల అధ్యక్షులు వెంకటనాయునిపల్లె శ్రీనివాసులు యాదవ్, ఓంప్రకాష్, భాస్కర్ నాయుడు, టీఈ రాఘవేంద్ర గౌడు, ఆలేబాదు పరమేష్, చిన్నమల్కాపురం సుధాకర్ రెడ్డి, జలదుర్గం ఆర్‌ఈ నాగరాజ్ పాల్గొన్నారు.


కోట్ల విజయభాస్కర్ రెడ్డి విగ్రహానికి నివాళి అర్పిస్తున్న కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి, టీడీపీ నాయకులు, అభిమానులు

తాగు, సాగు నీటికి ప్రాధాన్యం

ప్యాపిలి: సీఎం చంద్రబాబు తాగు, సాగు నీటి పరిష్కారానికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి అన్నారు. మండలంలోని హుసేనాపురం గ్రామంలోని చెరువు నుంచి పలు గ్రామాలకు తాగు నీటిని అందించే పైపు లైన్ నిర్మాణాన్ని సీనియర్ టీడీపీ నాయకులు వై లక్ష్మినారాయణ యాదవ్ తమ సొంత నిధులతో ఏర్పాటు చేశారు. ఈ పనులను శనివారం ఎమ్మెల్యే కోట్ల పరిశీలించారు. ఈ సందర్భంగా కోట్ల మాట్లాడుతూ హంద్రీ, నీవా సుజల స్రవంతి పథకం ద్వారా త్వరలో చెరువులకు నీరందించి తాగు, సాగు నీటి సమస్యను పరిష్కరిస్తామన్నారు. కార్యాక్రమంలో డీసీఎంఎస్ చైర్మేన్ నాగేశ్వరరావు యాదవ్, రాజశేఖర్ నాయుడు, తిమ్మారెడ్డి, సుదర్శన్, ఆర్ శ్రీనివాసులు ,అధికారులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి ఒక వరం

● మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి


డీఎస్సీలో ఉపాధ్యాయుడిగా ఎంపికైన అభ్యర్థిని సత్కరిస్తున్న మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి

బనగానపల్లె, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులుగా సేవలందించడం ఒక వరం అని మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి అన్నారు. ఇటీవల కూటమి ప్రభుత్వం నిర్వహించిన డీఎస్సీలో 16వేలకుపైగా ఉద్యోగాలు వచ్చాయని, వారందరికి ఆయన శుభాకాంక్షలు తెలిపారు. పట్టణానికి చెందిన గట్టు హనుమంతరెడ్డి డీఎస్సీలో ఉత్తీర్ణత సాధించి ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. శనివారం బీసీ రాజారెడ్డిని ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. బీసీ రాజారెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో ఉపాధ్యాయులుగా ఎంపికై వారికి అభినందనలు తెలిపారు. సేవాభావంతో పనిచేసి భావిభారత పౌరులను తీర్చిదిద్దాలని ఆయన ఉపాధ్యాయులను కోరారు. కార్యక్రమంలో గోపాల్‌రెడ్డి, బాలతిమ్మారెడ్డి పాల్గొన్నారు.

భక్తుల విశ్వాసాన్ని చూరగొన్న సీఎస్ఐ చర్చిలు ..

కొలిమిగుండ్ల, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : క్రైస్తవ సాంప్రదాయంలోని వివిధ వర్గాల విశ్వాసాన్ని చూరగొన్న సీఎస్ఐ చర్చిలకు ఎంతో ప్రాధాన్యత ఉందని కొలిమిగుండ్ల మండల రెవరెండ్ పాస్టర్ శ్రీదేవి పేర్కొన్నారు. సీఐస్ఐ చర్చిలు ఏర్పడి 79సంవత్సరాలు అవుతున్న సందర్భంగా శనివారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎస్ఐ చర్చిల యొక్క ప్రాముఖ్యత, గొప్పతనాన్ని పాస్టర్ ఎం.శ్రీదేవి భక్తులకు వివరించారు.

ఆకట్టుకున్న వివిధ అలంకారాలు

జిల్లాలో దేవీశరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం 6వ రోజు వివిధ రూపాల్లో అమ్మవార్లు దర్శనమిచ్చారు. భక్తులు అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు.


బనగానపల్లెలో గజలక్ష్మి మాత అలంకారంలో..


బెలుంలో లలితా స్వరూపిణీ అలంకరణలో


అవుకులో బాలత్రిపుర సుందరి దేవిగా...


సంజమాల: గజలక్ష్మీ దేవిగా అమ్మవారు


చాగలమర్రిలో భవానీ దేవి అలంకారంలో


ముత్యాలపాడులో గజలక్ష్మీదేవి అలంకారంలో..


శిరివెళ్లలో లలితత్రిపుర సుందరీదేవిగా...




ఉయ్యాలవాడ: లలితాత్రిపుర సుందరి అలంకారంలో..


ప్యాపిలిలో గజలక్ష్మీదేవి అలంకరణలో దుర్గాదేవి


బేతంచెర్ల: లలితా త్రిపుర సుందరీ దేవి..